కృష్ణయ్యది ప్రభుత్వ హత్యే: మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

విశాలాంధ్ర-కడప: సింహాద్రిపురం అంకాలమ్మ గూడూరులో జరిగిన దళితుడు జంజాల కృష్ణయ్య హత్యను ప్రభుత్వ హత్యగా భావిస్తు న్నట్లు టీడీపీ మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల అసెంబ్లీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రారెడ్డి స్పష్టంచేశారు. అంకాలమ్మ గూడూరులో హత్యకు గురైన కృష్ణయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకాలమ్మ గూడూరు గ్రామంలో జరిగిన ఓ చిన్న సంఘటనకు సంబంధించి కృష్ణయ్య గ్రామం విడిచి వెళ్లారన్నారు. కృష్ణయ్యకు సామాజిక భద్రతా పింఛన్ వస్తోందన్నారు. రెండు నెలలు పింఛను అందుకోకపోతే కట్ అవుతున్న ఉద్దేశంతో కృష్ణయ్య పోలీసులను ఆశ్రయించారన్నారు. అందుకు పోలీసులు అనుమతించడంతో కృష్ణయ్య అంకాలమ్మ గూడూరుకు వచ్చారన్నారు. పోలీసులు అనుమతి ఇచ్చారుకానీ అందుకు రక్షణ కల్పించలేకపో యారని ఆరోపించారు. కృష్ణయ్యకు ఏదైనా హాని జరుగుతుందని తెలిసినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే హత్యకు దారితీసిందన్నారు. గతంలో కూడా లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో దళిత మహిళ నాగమ్మ హత్యకు గురైందని, అప్పుడు కూడా పోలీసులు అలసత్వం వహించారన్నారు. అప్పట్లో నాగమ్మ హత్య కంటితుడుపుగా పోలీసులు చర్యలు తీసుకోవడంతోనే నేడు కృష్ణయ్య విషయంలో అదే జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఏదో ఒక ప్రాంతంలో దళితులమీద హత్యలు, అరాచకాలు, లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. దీన్ని బట్టి చూస్తే ముఖ్యమంత్రి జగన్‌కు దళితులపై ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. కావున జగన్ అండదండలతోనే కృష్ణయ్య హత్యకు గురయ్యారని తాము భావిస్తున్నట్లు బీటెక్ రవి పేర్కొన్నారు. కావున కృష్ణయ్యది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని బీటెక్ రవి డిమాండ్ చేశారు.

ప్రొటెక్షన్ వాచర్లకు సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-సిద్ధవటం : సిద్ధవటం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రొటెక్షన్ వాచర్లకు యూనిఫాం, జంగి ల్ షూస్, టార్చ్ లైట్, వాటర్ బాటిల్, గడియారాన్ని కడప డిఎఫ్ఓ సందీప్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడప రేంజర్ ప్రసాద్ సిద్ధవటం ఇన్చార్జ్ రేంజర్ ఓబులేసు, అటవీశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం : తులసి రెడ్డి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : విద్యుత్ చార్జీలను పెంచి రాష్ట్రంలో ఉన్న వైకాపా ప్రభుత్వం ప్రజలకు కరెంట్ షాక్ తగిలేలా చేస్తుందని, ఏపీసిసి మీడియా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం రాత్రి పోరుమామిళ్ల పట్టణం, అన్వర్ హాస్పిటల్ నందు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా, ప్రజలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తూ దొందు దొందు గానే వ్యవహరిస్తున్నాయని, అక్కడ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చమురు గ్యాస్ ధరలు పెంచి ప్రజలను అల్లాడిస్తుంటే, ఇక్కడ రాష్ట్రంలో ఉన్న వైకాపా ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు పెంచడమే కాకుండా, మరలా ఇప్పుడు ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకాపా, భాజపా ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కూడా రెండు పార్టీలు అధికారం కోల్పోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి అన్వర్, కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, కార్యకర్తలు ముజాహిద్, పైసల్, సోహెల్, ఫయాజ్, అల్తమాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

విశాలాంధ్ర - వేంపల్లి: వేంపల్లి ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా ఎమ్ ఈ ఓ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం అమలు చేయడం వల్ల 25 శాతం సీట్లు ఇవ్వడం వల్ల పేద ,బడుగు,బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని తెలిపారు పేద విద్యర్థులు ప్రాథమిక హక్కైనా విద్యకు దూరం కాకూడదు అన్న లక్ష్యంతో 2010లో కేంద్ర ప్రభత్వం ఈ చట్టాన్ని తెచ్చిందన్నారు అలాగే ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల నుండి తీసుకునే ఫీజుల వివరాలతొ సూచిక బోర్డులు ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు ఎలా ఉన్నాయి అని ఎమ్ ఈ ఓ వెళ్లి పరిశీలించాలని చెప్పారు. పాఠశాలలోనే నోటు పుస్తకాలు టెక్స్ట్ బుక్స్ కొనాలని చెప్పి అధిక ధరలకు విక్రయించడం దారుణమని తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి సుస్మాపూజిత, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ సునీల్ కుమార్, నామా చరణ్ ,నిఖిల్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలతో చేదోడుగా నిలవాలి: ఓఎస్డీ

విశాలాంధ్ర-వేంపల్లె: గ్రామ సంఘం సభ్యులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని తద్వారా ఉపాధి పొంది కుటుంబాలకు చేదోడుగా నిలవాలని ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేంపల్లె మండలం టి.వెలమవారిపల్లెలో గ్రామ సంఘం కార్యాలయం, వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ మాట్లాడుతూ బ్యాంక్ రుణాలు తీసుకుని వాటిని తిరిగి సకాలంలో చెల్లిస్తే అటువంటి సంఘాలకు బ్యాంక్‌లు అధిక ప్రాధాన్యతనిస్తా యన్నారు. బ్యాంక్‌ల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళా సాధికారత సాధించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం ఆయన టి వెలమవారిపల్లె, తాళ్లపల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రక్షిత మంచినీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన



విశాలాంధ్ర-కడప : పులివెందుల పట్టణంలో నిర్మాణదశలో ఉన్న అభివృద్ధి పనులను శుక్రవారం వైసీపీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కమిసనరు నరసింహారెడ్డిలు పరిశీలించారు. ప్రధాన రహదారి తదితర ప్రాంతాలల్లో పర్యటించారు. వీలైనంత త్వరలో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని వారు ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..!

విద్యుత్ చౌర్యంపై చర్యలు శూన్యం- రాజకీయ ఒత్తిళ్లే కారణమా -చర్యలు తీసుకుంటాం- విజిలెన్స్ సీఐ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : నష్టాలను పూడ్చుకునే ప్రయత్నాల్లో భాగంగా ఎప్పటికప్పుడు విద్యుత్ ఛార్జీలను అమాంతం పెంచుకుంటూ వెళుతున్న విద్యుత్ శాఖ అధికారులు నష్టాలకు ప్రధాన కారణమైన విద్యుత్ చౌర్యంపై ఎందుకు స్పందించడం లేదో బోధపడని అంశం. పారిశ్రామికప్రాంతమైన ఎర్రగుంట్లలో నాపరాయి గనులకు సంబంధించి కొంతమంది యజమానులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు కొందరు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నుండే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా లేక ఇతరత్రా కారణాలేమైనా ఉన్నాయా అన్న చర్చ ఊపందుకుంది. సహజంగా ఒకప్పుడు పత్రికల్లో కథనాలు ప్రచురితం కాగానే ఉన్నతాధికారులు స్పందించి క్రింది స్థాయి అధికారుల ద్వారా చర్యలకు ఉపక్రమించేవారు. ఇటీవలి కాలంలో ఈ విధానం మచ్చుకు కూడా కనిపిం చకపోవడం విడ్డూరం. ముఖ్యంగా విద్యుత్‌శాఖలో సమస్యలపై స్పందన శూన్యమని చెప్పవచ్చు. విద్యుత్ చౌర్యం ద్వారా లాభపడుతున్న వారు కొందరైతే సామాన్య గృహ అవసరాలకు వాడుకునే వారు మాత్రం ప్రతి నెల ఛార్జీల మోత బాదుడు రూపంలో భరించాల్సి వస్తోంది. కొందరు గనుల యజమానులు రాత్రి సమయాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారన్న వాదన బలంగా ఉంది. కిందిస్థాయి సిబ్బంది సహకారంతో పాటు ఒకరిద్దరు అధికారుల అండదండలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం కొంతమంది ఉన్నతాధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విశేషం.

నిర్లక్ష్యపు జాడ్యం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్‌రంగ సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు ప్రస్తావించడం, ఏకరువు పెట్టడం, ఆగ్రహించడం వంటి ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా విరిగిన, వొంగిన స్థంభాలను మార్చాలని వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు చేపట్టాలన్న అంశాలపై పల్లె ప్రతినిధులు తమ కంఠాలు అరిగిపోయేలా ఘోషిస్తున్నప్పటికీ విద్యుత్ శాఖాధికారు లలో చలనం లేకపోవడం ఆ శాఖ పనితీరుకు నిదర్శ నంగా నిలుస్తోంది. మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో ప్రమాదపుటంచున నిలిచి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై జడ్పీటీసీ సభ్యులు బాలయ్య ఏకంగా జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రస్తావించినప్పటికీ కిందిస్థాయి అధికారులలో చలనం లేకపోవడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం- విద్యుత్ విజిలెన్స్ సీఐ: ఎర్రగుంట్ల ప్రాంతంలోని నాపరాయి గనులలో విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ విజిలెన్స్‌సీఐ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ గత ఏడాది రాయలసీమ జిల్లాల్లో విస్తృత దాడులు నిర్వహించామని ఆయన గుర్తుచేశారు. అదే తరహాలో ఏకకాలంలో చర్యలకు ఉపక్రమిస్తామని ఆయన వివరించారు.

విద్యార్థుల పాలిట కంశుడిగా సీఎం జగన్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో విద్యార్థుల పాలిట సీఎం జగన్ మోహన్‌రెడ్డి కంశుడిగా నిలిచాడని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ విమర్శించారు. ఈసందర్భంగా ఫీజు ఎక్కడ కంశమామ అనే గోడపత్రికలను స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ నాడు రాష్ట్ర ప్రజలకు, విద్యార్థుల కు ,నిరుద్యోగులకు, మాయమాటలు చెప్పి మోసం చేసి ముఖ్యమంత్రిగా కూర్చున్న జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా పరిపాలన కొనసాగించడం చాలా దారుణమన్నారు. ఎందుకంటే విద్యాదీవెన తో విద్యార్థులను మోసం చేస్తూ అమ్మ ఒడితో అడ్డంకులు కలిగించి తల్లిదండ్రులను మోసం చేస్తూ పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకుండా వసతిదీవెన పేరుతో వంచన మాటలు చెప్పి విద్యార్థులకు ఇచ్చిన హామీలు తప్పి కేవలం విద్యను వ్యాపారం చేసుకునే కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నా ఈ వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలందరూ కూడా గమనిస్తున్నారు. ఖచ్చితంగా ఈ 2024 సంవత్సరంలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీని చిత్తుగా ఓడించడం ఖామన్నారు. మళ్ళీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు అయితేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుం దన్నారు.ఇప్పటికైనా విద్యార్థులకు రావలసిన బకాయి లు విడుదల చేయాలని లేనిపక్షంలో తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ ఎఫ్ కడప పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పి.భరత్ కుమార్, కడప పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ విశ్వనాథ్, నగర అధ్యక్షుడు అనిల్, నగర ప్రధాన కార్యదర్శి ఓర్సు అరుణ్, నగర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీద్, నగర కార్యదర్శులు మల్లేష్, వై.రెడ్డి బాబు, నాయకులు, ఆనంద్, శ్రీకాంత్, సాయి, షేక్ యూనిస్, షేక్ సుబహాన్, పుట్టిక వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమవాసులకు అన్నదానం

విశాలాంధ్ర-కడప: పులివెందుల పట్టణ శివార్లలోని లీలావతీ చారిటబుల్ ట్రస్టు, అలాగే వీరనాయణస్వామి అంధుల ఆశ్రమంలో ఆశ్రమవాసులకు శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొంగనపల్లె లక్ష్మినారాయణ మ్మ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని 23వ వార్డు కౌన్సిలరు కొండల రావు, మురళీమోహన్ కుటుంబ సభ్యులు కలిసి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయికృష్ణరమ్మ, కృష్ణచేతన్, రిషికేస్, రాజేశ్వరిదేవి, సుభద్ర ఆశ్రమ నిర్మాఖులు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

విశాలాంధ్ర- పోరుమామిళ్ల : పోరు మామిళ్ల మండలం ఈదులపల్లి గ్రామానికి చెందిన రత్నకుమారి అను గర్భిణీ పోరుమా మిళ్లలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు చేరగా హాస్పిటల్ వైద్య సిబ్బంది ఓ, ఏ పాజిటివ్ రక్తం ఏర్పాటు చేసుకోవాల్సిందిగా తెలుపగా పేషెంట్ తాలూకా బంధుమిత్రులు రక్తం కోసం ప్రయత్నం చేయగా చివరి క్షణాల్లో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ ను ఆశ్రయించగా ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్ రసూల్ స్పందించగా పోరుమామిళ్ల మండ లం వరికుంట్ల గ్రామనికి చెందిన వరికుంట్ల రాజేశేఖర్‌చే ఓ పాజిటివ్ రక్తం అత్యవసరంగా రక్త దానం చేపించారు.ఈ సందర్భంగా సంస్థ పౌండర్ రసూల్ ప్రసాద్ లు అడిగిన వెంటనే , రక్త దానం చేసినదుకు అభినందిస్తు రక్త దానం చేయాలనే ఉత్సాహవంతులు దయచేసి స్వచ్ఛంద సేవకులు మాలాంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు చేయూతనిచ్చి అత్యవసర పరిస్థితిలో రక్తమందక కొట్టుమిట్టలాడుతున్న రోగుల ప్రాణాలను కాపాడాలని పిలుపుని చ్చారు.ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలనుకుంటే 8125991900, 9182990214 వాట్స్ అప్ నంబర్ కి మెసేజ్ చేయాలని తెలిపారు.

అక్రమకేసుల నమోదుపై పుట్టా ఆగ్రహం

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు, జూన్ నెల 2,3,4 తేదీలలో మైదుకూరులో జరిగిన యువగలం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం పై మైదుకూరు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఏకపక్షంగా టిడిపి నేతల పై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడారు. మైదుకూరులో 3 వ తేదీ యువగలం పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన సభ వద్ద టిడిపి నేతలు, కార్యకర్తలు మున్సిపాలిటీకి డబ్బులు చెల్లించి, వ్యాపారుల అనుమతితో నిబంధనల ప్రకారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే పోలీసులు వైకాపా నేతల పిర్యాదుతో తనపై, టిడిపి నేతలపై అక్రమంగా రెండు కేసులు నమో దు చేసారన్నారు. ఈ కేసు లపై హైకోర్టు ను సంప్రదించగా ఒక కేసును కొట్టి వేయడంతో పాటు మరో కేసుపై స్టే విధించిందని పేర్కొన్నారు. అక్రమకేసుల కు తాము భయపడమని వెల్లడించారు. మైదుకూరు డిఎస్పీ, సీఐ లు నిష్పాక్షపాతంగ వ్యవహరించాలని లేని పక్షంలో వారిపై చట్ట పరంగా ప్రైవేట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. టిడిపి నేతలు పిర్యాదు చేస్తే కేసులు నమోదు చేయకుండా వైకాపా తొత్తుల్లా పోలీసులు వ్యవహరించడం తగదని హితవు పలికారు. పోలీసు అధికారులు చట్టపరంగా వ్యవహరించని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు.

వృద్ధురాలికి అండగా ఏపీఎన్ఆర్టీఎస్

మానవత్వాన్ని చాటుకున్న బొంబాయి యువకుడు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఈస్ట్ గోదావరి జిల్లా రాజోలు మండలం సఖినేటిపల్లికి చెందిన మూరి పద్మావతి (64) అనే వృద్ధురాలికి ఇరవైఏళ్ల క్రితం జీవనోపాధి కొరకు కంపెనీ వీజాపై కువైట్ వచ్చింది. కానీ ఈమెకు వీజా తీసిన వ్యక్తి రాజంపేట అడ్రస్‌పై పాస్ పోర్ట్ తయారు చేయించి ఫ్రాడ్ వీజా తీసి మోసాం చేసాడు. ఈ కంపెనీ కేవలం వీజాలు తీసి అమ్మేసి ఆ తర్వాత కంపెనీ మూసేస్తారు. పద్మావతి అకామా లేకున్నా కువైటీ ఇంట్లో పని చేసే హౌస్ మెయిడ్స్‌కు బట్టలు అమ్మి జీవనం సాగించేది. కరోనా సమయంలో అనారోగ్యానికి గురై అకామా లేని కారణంగా ఆసుపత్రికి కూడా పోలేని పరిస్థితిలో బంధువులు ఎవ్వరు లేక పక్క రూములో ఉన్న బొంబాయికి చెందిన మహమ్మద్ యూనుస్ అనే యువకుడు (అల్ సలాం ఇంటర్నేషల్ ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తాడు) తెలిసిన డాక్టర్స్‌కు చెప్పి మందులు ఇప్పిస్తూ పద్మావతి అనారోగ్యానికి గురయినప్పటి నుండి అన్ని తానై తన తల్లి లాగా చూసుకుంటున్నాడు. కాగా పద్మావతి విషయం వైకాపా కువైట్ సీనియర్ నాయకులు ఆకుమూర్తి లాజరస్, ఏపీఎస్ఆర్‌టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ బి.హెచ్, కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ నాయని మహేష్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వారు 29-05-2023 తేదీన మురి పద్మావతి ఉండే చోటుకి వెళ్లి ఆమె పరిస్థితిని చూసి ఏపీఎస్ఆర్టీఎస్ చైర్మన్ దృష్టికి వెళ్లి ఎంబసీ అధికారుల సహాయంతో త్వరలో ఇండియా పంపించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భముగా ఇలియాస్, బాలిరెడ్డిలు మాట్లాడుతూ తన తల్లిలా చూసుకున్న బొంబాయి యువకుడు మహమ్మద్ యూనుస్‌ను అభినందించారు. మానవత్వం ముందు కులం మతం నిలబడలేక పోయాయని తెలిపారు. పద్మావతిని ఇండియా వెళ్ళేందుకు సహకరించిన భారత రాయబార కార్యాలయ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏపీఎన్ఆర్టీఎస్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి కువైట్ ఏపీఎన్ఆర్టీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ మహేష్‌ను అభినందించారు. ఈ సందర్భముగా బొంబాయి యువకుడు యూనుస్ మాట్లాడుతూ పద్మావతిని వారి స్వస్థలంకు పంపేందుకు ఏడాది నుంచి ప్రయత్నించామని పద్మావతిపై కేసులు, అరెస్ట్ వారెంట్ ఉండటంతో ఎంబసి వారు కూడా ఏమి చేయలేమని అన్నారని చివరకు ఏపీఎస్ఆర్టీఎస్ కువైట్ సభ్యుల చొరవతో ఎంబసీ అధికారులు పద్మావతిని ఇండియా పంపుతున్నందుకు ఎంబసీ అధికారులకు ఏపీఎన్ఆర్టీఎస్ కువైట్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో వైకాపా సలహాదారులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఆకుమూర్తి లాజరస్, రెడ్డయ్య, గడ్డం మోహన్ పాల్గొన్నారు.

త్రైమాసిక పన్ను పెంపు గర్హణీయం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నును ఒకేసారి 25శాతం పెంచడం గర్హణీయమని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. ఇందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవోనంబరు 31ని వెంటను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వేంపల్లెలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వడ్డింపులు, వాయింపుల ప్రభుత్వంగా మారిందన్నారు. జగన్ పాలనలో ఇప్పటికే రవాణారంగం కుదేలైందన్నారు. రవాణా వాహనాలపై త్రైమాసిక పన్ను పొరుగు రాష్ట్రాల కంటే 30శాతం అధికంగా ఉందన్నారు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ కూడా అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఉందని ఆరోపించారు. ఇది చాలదన్నట్లు లీటరు డీజిలపుపై నాలుగ రాపూయాలు అదనపు డ్యూటీ, రూపాయి రోడ్డు సెస్సు ప్రభుత్వం విధిస్తోందన్నారు. అన్ని రాష్ట్రాల కంటే ఏపీలోనే రేట్లు అధికంగా ఉన్నాయని తెలిపారు. గోరుచుట్టుపై రోకలిపోటు అన్న చందంగా రవాణా వాహనాలపై ఒకేసారి 25శాతం పన్నుపెంచడం దారుణన్నారు. ఈవిషయమై ఈ ఏడాది మే 15వ తేదీన ప్రభుత్వ జీవోనం బరు 31ని విడుదల చేసిందన్నారు. వాహనా లపై గ్రీన్‌టాక్సును ఒకేసారి రెండువందల రూపాయల నుంచి రూ.20వేలకు పెంచిందన్నారు. ఆరు చక్రాల వాహనాలపై ఇదివరకే త్రైమాసిక పనున రూ.3940లు కాగా ఇప్పుడు రూ.4970లు చెల్లించాల్సి ఉందన్నారు. రాబోవు రోజుల్లో బస్సు చార్జీలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు కాంగ్రెస్‌పార్టీ సిద్ధమవుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, మండలశాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు ఉత్తన్న, నామా వినయ్, బాలం సుబ్బరాయుడు, శివారెడ్డి, రవి, బద్రి, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఫారెస్ట్ రేంజర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర-సిద్ధవటం : అటవీ క్షేత్ర అధికారి బదిలీ పై కడపకు వెళ్లడంతో సిద్ధవటం అటవీ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు విధి నిర్వహణలో భాగంగా ఆయన చేసిన సేవలు మరువలేనివి అని అటవీ శాఖ సిబ్బంది తెలియజేశారు. జిల్లా ఫారెస్ట్ అధికారి సందీప్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధవటం ఫారెస్ట్ రేంజర్ ప్రసాద్ మండల పరిధిలో మంచి పేరు ప్రఖ్యాత తెచ్చుకున్నారని విధి నిర్వహణలో భాగంగా అంకితభావంతో కృషి చేశారని కొండ సంపద తరలిపోకుండా గట్టి చర్యలు తీసుకున్నారని సిద్దోటంలో ఫారెస్ట్ రేంజ్ అధికారిగా దాదాపు 5 సంవత్సరాల పైన విధులు నిర్వహించి మండల పరిధిలో మంచి పేరు తెచ్చుకున్నారని సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ అటవీశాఖ అధికారి ప్రసాదు కు శాలువతో సత్కరించి పూలమాలలు వేశారు. డిప్యూటీ రేంజర్ ఓబులేసు మాట్లాడుతూ సిబ్బంది పట్ల విధి నిర్వహణలో భాగంగా ఎక్కడ కూడా చిన్నపాటి సమస్య రాకుండా అంకిత భావంతో విధులు నిర్వహించారని డిప్యూటీ రేంజర్ ఓబులేసు అన్నారు. సిద్ధవటం, ఒంటిమిట్ట, అటవీ శాఖ సిబ్బంది సప్తగిరి పర్యావరణ సమితి అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ అధికారికి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం సర్పంచ్ ప్రతినిధి బి ఓబులయ్య, జిల్లా పరిషత్ హై స్కూల్ స్కూల్ కమిటీ చైర్మన్ మునిస్వామి, సిద్ధవటం గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు ఎం నాగరాజు, ముస్లిం మైనారిటీ సోదరులు బాబి, ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్‌కు ఘనంగా సత్కరించారు.

యువగళం పాదయాత్రతో ఒరిగిందేమీ లేదు

విశాలాంధ్ర-అట్లూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా బద్వేల్ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా అభివృద్ధిలో పయనింపచేయడం జరుగుతుందని వైసీపీ మండల నాయకుడు, కువైట్ ఎన్ఆర్ఐ దున్నూతల రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో బద్వేల్ నియోజకవర్గంలోని ప్రజలకు ఒరిగిందేమీ లేదని దుయ్యపట్టారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమకు ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేకపోయారని టీడీపీ నేతల మాయమాటల కు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బద్వేల్ ఎమ్మెల్యే డా.సుధలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఒకవైపు అభివృద్ధి మరోవైపు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం తప్పకుండా అమలుచేయడంతో పాటు చెప్పిన హామీలే కాక చెప్పని హామీలు అమలు చేసి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా సుపరిపాలన చేస్తున్నారన్నారు. బద్వేల్ ప్రాంతానికి సెంచరీ ఫ్యాక్టరీ ద్వారా ఎంతో మందికి జీవనోపాధి లభించడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి మార్గాలు సుగమం చేసిన సీఎంజగన్‌కు రానున్న ఎన్నికల్లో మరోమారు అధికారం చేపట్టడం తధ్యమన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డేది

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలోని పొట్టిపాడు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా సమస్య గత వారం రోజులుగా కొనసాగుతోంది. శుక్రవారం రోజు గ్రామం నుండి వెళ్తున్న ఇసుక టిప్పర్‌లు, లారీలను గ్రామంలోని మహిళలు అడ్డుకున్నారు. ఇసుక రవాణా గత మూడు సంవత్సరాల నుండి జె.పి సంస్థకు ప్రభుత్వం అప్పజెప్పింది. వారి కాంట్రాక్ట్ గడువు ఈనెల 1వ తేదికి గడువు ముగిసిందని ఐనప్పటికి యదేచ్ఛగా రాత్రి, పగలు ఇసుక రవాణా జరుగుతుందని, దీంతో గ్రామం నుండి తిమ్మాపురంకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం అయిందని, ఈ మార్గం గుండా ప్రయాణం చేయాలంటే నరకయాతనే అని, గ్రామంలోకి ఎవరికైన అనారోగ్యం ఉంటే కనీసం అంబులెన్సు రావాలన్నా గంట సమయం పడుతుందని ఇలా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండిపడ్డారు. ఇసుక రీచ్‌లో గుంతలు ఎక్కువ లోతులు తీయడం వల్ల భూగర్భ జలాలు అడిగింటి నీటి సమస్యలు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వమే ఇలా పోలీసులు, అధికారుల సహాయంతో ఇసుక తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపణలు చేశారు. ఇసుక టిప్పర్‌లు మా గ్రామం నుండి వెళ్లవద్దని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో తాళ్ల ప్రొద్దుటూరు, ముద్దనూరు ఎస్ఐలు రవికుమార్, చంద్రమోహన్, యర్రగుంట్ల ఏఎస్ఐ అబ్రహం, కొండాపురం ఏఎస్ఐ ఉత్తమారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మహిళలతో మాట్లాడుతూ ఇసుక రవాణా ప్రభుత్వ ఆదేశాల మేరకు జరుగుతుందని, దీనిని అడ్డుకొనే హక్కు ఎవరికి లేదని వెంటనే వెళ్లిపోవాలని లేనిఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా రోడ్డుపైన వాహణాలు వెళ్లవద్దనే హక్కు కూడ ఎవరికిలేదని అందరూ సహకరించాలని కోరారు. మహిళలకు మద్దతుగా గ్రామానికి చెందిన రాజా నరసింహారెడ్డి, డా.నవజ్యోత్ రెడ్డి, అనంతపురం పెద్దిరెడ్డి, అశోక్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జడ్పీటీసీ శేఖర్, శ్రీరంగనాథ్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎం కళాశాలలో గ్లోబల్ బ్యూటీలో ఎంపిక

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గ్లోబల్ బ్యూటీ ట్రేసర్, గ్లోబల్ బ్యూటీ హ్యాండ్సమ్ (హైదరాబాద్) కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల వారి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల సభా సమవేశంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ బ్యూటీ ట్రెజర్, గ్లోబల్ హ్యాండ్సం ట్రెజర్, (హైదరాబాద్) ముఖ్య నిర్వా హకురాలు సుహాసిని పాండ్యా మాట్లాడుతూ 14-17 (పెళ్ళి కానీ వయసు వారు), 18-30 (పెళ్లి అయిన వయసు వారు) నిర్వహించిన ఈ ఎంపికలలో వివిధ ప్రాంతాల నుండి 30 మంది పార్టీసిపేట్ చేయగా ఇందులో 10 మంది ఎంపిక అయ్యారని వీరికి ఆగస్టు నెలలో లీ మెరిడియన్ హెూటల్ హైదరాబాద్ లో గ్రాండ్ ఫైనల్ ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి నాని ప్రధానాచార్యులు డాక్టర్ విఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్, గ్లోబల్ బ్యూటీ ట్రెజర్ గ్లోబల్ హ్యాండ్సం ట్రెజర్ జనరల్ మేనేజర్ సరస్వతి, వారి సిబ్బంది కళాశాల కల్చరల్ కమిటీ సమన్వయకర్త వీర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



కడప రిమ్స్ వైద్య కళాశాలలో ఇష్టారాజ్యం

విశాలాంధ్ర-కడప : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్య కళాశాలలో మానసిక విభాగంలో అసోసి యేట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఆర్ వెంకట్ రాముడు తన సరెండర్ లీవ్ సంబంధిం చిన డబ్బులు మంజూరు విషయంలో పరిపాలన విభాగం వారు నిర్లక్ష్యం వహించాలని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులకు తమ ఆవేదనను తెలియజేశారు. తన కుటుంబ అవసరాల కోసం తనకు రావాల్సిన సరెండర్ లీవ్ లో నుంచి డబ్బులను మంజూరు చేయించుకునేందుకు ఆ వైద్య కళాశాలలో ఈనెల 9న ఎస్టాబ్లిష్మెంట్ అకౌంట్స్ భాగాలలో దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఈ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ల నిర్లక్ష్యం వలన ఈ నెల 13వ తేదీ వరకు ప్రొసీడింగ్స్ ను తయారు చేసి ఇవ్వకపోవడం వలన నిధులు మంజూరు కాలేదన్నారు. మరలా ఒక నెల ఆలస్యం జరిగిందన్నా రు. దీనికంతటికీ కారణం ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది పైన వస్తున్న ఆరోపణల కారణమన్నారు. తన ఒక్క సమస్య నే కాదని, ఆయా విభాగాల్లో కొందరు డబ్బులు ఇస్తే గాని పనులు చేయరని ఆరోపణలు ఎన్నో వినిపిస్తున్నాయని ఆయన తెలియజేశా రు. ఈ సంఘటనపై ఎస్టాబ్లిష్మెంట్ అకౌంట్స్ ఆఫీస్ సూపరింటెం డెంట్ శ్రీనివాస్ ను వివరణ కోరగా పది రోజుల ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సిందని, డాక్టర్ వెంకట్రాముడు ఈనెల తొమ్మిది న దరఖాస్తు చేసుకున్నారని ఆయనతోపాటు దరఖాస్తు చేసుకున్న మిగతా ముగ్గురు డాక్టర్లు కూడా 13వ తేదీన ప్రొసీడిం గ్స్ ఇచ్చామన్నారు. ఈనెల 15వ తేదీన మధ్యాహ్నం లోపే ట్రెజరీలో ఈ బిల్లులకు సంబంధించిన సర్వీసులను నిలిపివేశారని వివరణ ఇచ్చారు.

లంచమివ్వలేదనే బిల్ చేయలేదు: కలెక్టర్ కు ఫిర్యాదు: సర్వజన ఆస్పత్రిలో సరెండర్ లీవ్ బిల్లు చేసేందుకు లంచం ఇవ్వని కారణంగానే సంబంధిత ఉద్యోగి బిల్లు చేయలేదని డాక్టర్ వెంకటరాముడు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు .ఈనెల తొమ్మిదో తేదీనే లెటర్ ఇచ్చినా 13 వ తేదీ వరకు కూడా బిల్లు చేయలేదు, ట్రెజరీకి కూడా పంపలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్ ఫిర్యాదు చేశారు. తాను ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నానని లంచం ఇచ్చే పరిస్థితి ల్లో లేనని న అందుకే వారు బిల్లు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. తనకు న్యాయం చేసి వారిపై చర్య తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.

తొలకరి పలకరించేదెప్పుడు?

- ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- వైయస్సార్ జిల్లాలో 77,105 హెక్టార్ల సాగు లక్ష్యం
- ప్రాజెక్టుల నుంచి ముందస్తుగా నీటి విడుదలకు యత్నాలు
- అధికారులు రైతులకు క్షేత్ర స్థాయిలో సహకారం అందించేలా చర్యలు

విశాలాంధ్ర-కడప : తొలకరి పలకరింపు కోసం వైయస్సార్ జిల్లా రైతాంగం ఎదురుచూస్తోంది. గత నాలుగేళ్లుగా జూన్ నాటికే వాతావరణం చల్లబడి తొలకరి వర్షాలు రైతులను పలకరించి పులకరించేవి. ఇదే అదనుగా రైతాంగం దిక్కులగు దిగేది. జూన్ నెలాఖరులో లేదా జూలై మొదటి వారంలో నారమళ్ళతో ఖరీఫ్ సాగు మొదలు పెట్టేవారు.అయితే ఈసారి జూన్ నెల మూడో వారంలో అడుగుపెట్టినా.. ఎండల తీవ్రత తగ్గలేదు. తొలకరి వర్షాల జాడ కనిపించడం లేదు. నైరుతి రుతుపవనాలు ఆలస్య మయ్యాయి.అవి రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత కూడా వాతావరణంలో మార్పు కనిపించడం లేదు. దీంతో కడప జిల్లా రైతులలో ఒకింత ఆందోళన వ్యక్తం అవుతోంది. వ్యవసాయ శాఖ మాత్రం వర్షాలు వస్తాయన్న నమ్మకం, జిల్లాలో నీ సాగునీటి ప్రాజెక్టుల్లో ఆశా నాజూకుగా నీటి నిల్వలు ఉన్నాయన్న నమ్మకంతో ఏడాది ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసింది.

ఖరీఫ్ పై ప్రత్యేక దృష్టి: జిల్లా వ్యవసాయ శాఖ ఈసారి ఖరీఫ్ సీజన్‌పై ప్రత్యేక దృష్టితో ఉంది. కలిసి ఇచ్చే వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ప్రభుత్వం ద్వారా రైతులకు చేరువ కావాల్సిన సహకారాన్ని సకాలంలో అందించాల న్న ముందస్తు చర్యలు చేపడుతోంది. జిల్లా కలెక్టర్ విజయరామరాజు కూడా ఇప్పటికే జిల్లా వ్యవసాయ అధికారులకు ఖరీఫ్ సాగుపై సూచన చేశారు.వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి రైతులకు సహకారం అందించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు ఈ ఏడాది ఖరీఫ్ కలిసి వస్తుందన్న నమ్మ కంతో ఉన్నారు.నైరుతి రుతు పవనాలు ప్రవేశించడంతో పాటు జిల్లాలోని పలు ప్రాజెక్టుల్లో అవసరమైన మేరకు సాగునీరు వుండటంతో ఇందుకు తగ్గట్టుగా సాగు ప్రణాళిక రూపొందించారు. జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఖరీఫ్ సాగుకు అవసరమైన మేర నీరు ఉన్నప్పటికీ జిల్లా అంతటా ఈ వనరులు లేవు కాబట్టి వర్షాలు కురిస్తే నే ఖరీఫ్ సాగుకు ఊపు వస్తుంది. లేదంటే ప్రాజెక్టులు, బోర్ల క్రింద మాత్రమే ముసుగోలు సాగవుతుంది.

72941 హెక్టార్లతో సాగు ప్రణాళిక : ప్రభుత్వం ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైన ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతుల పంటల సాగుకు అవసరమైన ఎరువులతో పాటు వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను ముందస్తుగా కేటాయించింది. ఇవి రైతులకు చేరవేసే చర్యలు చేపట్టిన వ్యవసాయ అధికారులు.మరోవైపు జిల్లాలో 77,105 హెక్టార్ల సాగు లక్ష్యంతో ప్రణాళిక రూపొందించారు.ఈ ఖరీఫ్ సీజన్లో జిల్లాలోని 36 మండలాల్లో 77,105 హెక్టార్ల వ్యవసాయ, ఉద్యానవన పంటలను సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ఆధారంగా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేశారు. ఇందులో 8,366 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను సబ్సిడీ పై సరఫరా చేయడం ప్రారంభించారు. వీటితో పాటు వివిధ రకాల ఎరువులు 59,342,89 మెట్రిక్ టన్నులు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వీటన్నింటిని రైతులకు అవసరాన్ని బట్టి పంపిణీ చేస్తారు. ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం పూర్తి లక్ష్యంతో సాగు అయ్యే అవకాశాలు వున్నాయని వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో అత్యధికంగా 33,215 హెక్టార్లలో వరి పంట, 21,566 హెక్టార్లలో పత్తి, 5,739 హెక్టార్లలో వేరుశనగ, 3,453 హెక్టార్లలో శనగ, 3,044 హెక్టార్లలో పసుపు, 1,817 హెక్టార్లలో మినుము, 1,332 హెక్టార్లలో జొన్న, 1,170 హెక్టార్లలో పొద్దుతిరుగుడు తదితర పంటలుసాగు ప్రణాళికలు రూపొందించారు. జిల్లా రైతాంగం తొలకరి వర్షాలు కురిసి ఒకటి రెండు పదనుల వానపడితే ఖరీఫ్‌సాగుకు సన్నద్ధమయ్యేందుకు ఎదురు చూస్తున్నారు.

'రైతులకు పూర్తి సహకారం - జిల్లా వ్యవసాయ శాఖ అధికారి : జిల్లా వ్యవసాయశాఖాధికారి ఏ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టారన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు ఎరువులు, విత్తనాలు తమకు అవసరమైన వాటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా తీసుకెళ్లవచ్చన్నారు.

పాఠ్యపుస్తకాల సరఫరాలో జాప్యం తగదు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : పాఠశా లల పున ప్రారంభం రోజునే విద్యార్థులం దరికీ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం జరిగినది. తెలుగు మాధ్యమ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ చేయడం జరుగుచున్నది కానీ ఎప్పటిలాగే ఉర్దూ పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదు. తత్ఫలితంగా ఉర్దూ మాధ్యమ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేకపోతున్నారు. ఈ విషయంలో విద్యా శాఖ వెంటనే స్పందించి రాష్ట్రంలోని అన్ని ఉర్దూ మాధ్యమ పాఠశాలలకు వెంటనే పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) రాష్ట్ర శాఖ అధ్యక్షులు యస్.అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్షకార్యదర్శులు యస్.నజీర్ బాష, యస్.అబ్బాస్ అలీ, లేడీ సెక్రటరీ మహబూబ్ చాన్‌లు గట్టిగా కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధుల సదస్సుకు హాజరైన ఎమ్మెల్సీ భూమిరెడ్డి

విశాలాంధ్ర-కడప: ముంబైలో మహారాష్ట్ర ఇన్స్టూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల జాతీయ ప్రజాప్రతినిధుల సదస్సుకు టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డితో పాటు మరోఎమ్మెల్సీ శివనాథరెడ్డిలు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 2500 మంది ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలు ఈ సదస్సుకు హాజరయ్యారు. వీరిరువురు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి స్పీకరు, మాజీ స్పీకర్లు కూడా పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యంగా చట్ట సభల్లో అనుసరించాల్సిన విధివిధానాలపైనా, ప్రజా సమస్యల పరిష్కారం, వివిధ రకాల సమస్యలు, సవాళ్లు, కౌన్సిల్, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చ జరిగినట్లు రామగోపాల్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. గాడితప్పు తున్న చట్టసభల తీరుపై కూడా చర్చించినట్లు పేర్కొన్నారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-వేంపల్లె: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ప్లస్‌టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. పాఠశాల ప్రారంభం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులకు ప్రభుత్వం విద్యాసామాగ్రి అందించడం ప్రారంభమైంది. ఈ క్రమంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్ల వల్ల విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపుతుందని ఉపాధ్యాయులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, జెడ్పీటీసీ రవికుమార్ొడ్డి, వైసీపీ మండల కన్వీనరు చంద్ర ఓబులరెడ్డి, వార్డు మెంబరు ఆంజనేయులు, ఎంఈఓ వీరారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు కొనసాగిస్తు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ కొన్ని ప్రైవేటు పాఠశాలలు రేకుల షెడ్లలో తరగతులు నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు లేకుండానే కొనసాగుతున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లీలాకృష్ణ, మస్తాన్, పణి, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం తహసీల్దార్‌గా బి.లక్ష్మీదేవి

విశాలాంధ్ర-సిద్దవటం : సిద్దవటం తహసీల్దార్‌గా బి. లక్ష్మీదేవిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఎర్రగుంట్లలో డిప్యూటీ తహసీల్దార్ గా పనిచేస్తున్న లక్ష్మీదేవి పదోన్నతిపై సిద్దవటం తహసీల్దార్‌గా నియమితులయ్యారు. సిద్దవటం తహసీల్దార్‌గా పనిచేస్తున్న శంకర్రావు వల్లూరుకు బదిలీ అవడంతో సిద్దవటం డిప్యూటీ తహసీల్దార్ రాజేష్ క్రిష్ణ ఇంచార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు పదోన్నతిలో భాగంగా ఎర్రగుంట్ల డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీదేవిని సిద్దవటం తహసీల్దార్ గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.

కరిముల్లా సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గత మూడు సంవత్సరాల నుండి కడప నగరంలో తన వంతుగా రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని కరపత్రాలు పంచుతూ సేవలందిస్తున్న అబ్దుల్ రాయల్ కరిముల్లా సేవలు అభినందనీయమని ఏపిఎన్ఆర్‌టిఎస్. డైరెక్టర్ బిహెచ్ ఇలియాస్ అన్నారు. జూన్ 14 ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ సంస్థ తరఫున ఉత్తమ వాలంట రీగా ప్రశంస పత్రము అందుకున్న సందర్భముగా శుక్రవారం ఇలియాస్ వారి కార్యాలయం నందు కరీముల్లాను ఘనంగా సత్కరించారు. రాబోవు రోజులలో కూడా రక్తదాన ప్రసార కార్యక్రమం నిరంతరం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై గ్రూప్ సభ్యులు అన్సర్, బాబు భాయ్, దర్బార్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో బీరం శ్రీధర్‌రెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర- చెన్నూరు/మైదుకూరు : ఖాజీపేట సమీపంలో విద్యే ధ్యేయంగా స్థాపించబడిన బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్-2023 ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో అమోఘమైన ప్రతిభ కనబరచారు. ఆలిండియా 247వ ర్యాంకుతో పి.చెంద్రాయుడు అనే విద్యార్థితో పాటు, పరీక్ష రాసిన ప్రతి ఇద్దరిలో ఒకరు మెడికల్ సీట్ సాధించి రాష్ట్రస్థాయిలోనే కాక జాతీయ స్థాయిలో కూడా కళాశాల పేరును నిలబెట్టారు. అంతే కాకుండా నిన్న విడుదలైన ఏపీ ఎప్‌సెట్ ఫలితాల్లో కూడా పి. చెంద్రాయుడు 53వ ర్యాంకు వి. ఓబుల్ రెడ్డి 103వ ర్యాంకు సాధించి రాయలసీమలోనే నెంబర్ -1 కళాశాలగా నిలబెట్టారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి, చైర్పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ దేశంలోనే నిష్ణాతులైన అధ్యాపకులచే నాణ్యమైన శిక్షణ అందిస్తూ ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించామని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ జూన్ 19వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. నీట్-2023 ఫలితాల్లో సీట్ రాని విద్యార్థులకు ఇది ఒక గొప్ప సదవకాశమని, కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటే తప్పకుండా మెడికల్ సీట్ 7 సాధిస్తారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోహన్‌పవార్‌కు తులసిరెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-వేంపల్లె: వైసీపీ ఎంపీటీసీ మోహన్‌పవార్‌ను పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పరామర్శించారు. బ్రెయిన్‌ట్యూమర్‌తో బాధపడుతున్న మోహన్‌పవార్ కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తులసిరెడ్డి కాంగ్రెస్ నాయకలు వేమయ్య, ఉత్తన్న, అమర్‌నాథరెడ్డి, వినయ్, శివయ్యలతో కడపకు వెళ్లి పరామర్శించడంతో పాటు మోహన్ ఆరోగ్య విషయాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మోహన్‌పవార్‌ను పరామర్శించిన వారిలో వైసీపీ నాయకుడు ఆర్ వేణు తదితరులు ఉన్నారు.

మేకల బాలాయపల్లెలో 'ఇదేం ఖర్మ'
భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలను వివరించిన 'భూపేష్'

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండలంలోని చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీ పరిధి మేకల బాలాయపల్లె గ్రామంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పార్టీ బాధ్యులు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి మొదట గ్రామంలోని కాశిరెడ్డినాయన ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి గ్రామం లోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైసీపీ అసమర్థ పాలనను వివరించారు. జరగనున్న ఎన్నికల్లో టీడీపీ అధికారం లోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇటీవల టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు భూపేష్ వివరించారు. పార్టీ అధికారంలోకి రాగానే అందరికీ న్యాయం చేస్తానని భరోసా కల్పించారు. కాగా గ్రామానికి చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి భూపేష్ పసుపుకుండువా కప్పి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల పార్టీ పర్యవేక్షకులు చదిపిరాళ్ల జయ రామిరెడ్డి, మండల బాధ్యులు మోహన్‌రెడ్డితో పాటు శాంబుడు, నరేష్, సుబ్బరా యుడు, సిద్దయ్య, గురుశేఖర్, చౌదయ్య, భాస్క ర్, నల్లపురెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, తొట్టి రామచంద్రారెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, రామాంజులయాదవ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో వల్లపు నాగేంద్ర, గోకుల వెంకటేష్, మురళీమోహన్‌రెడ్డి, ఎంవి సుధాకర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

ప్రజలపై విద్యుత్ బాదుడు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఏఐసీసీ మెంబర్- బండి జకరయ్య, ఎస్ ఏ సత్తార్లు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలకు తిలోదకాలు ఇచ్చి ఎడాపెడా విద్యుత్తు చార్జీలు పెంచుతూ ప్రజలపై పెనుభారం మోపింది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్తు ప్రైవేటీకరణ బిల్లుకు మద్దతునిచ్చి శరవేగంగా అమలు చేస్తూ విద్యుత్తు సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు రానున్న కాలంలో కూడా విద్యుత్తు చార్జీలు పెంచబోమని నమ్మబలికి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారు. నాణ్యమైన విద్యుత్తు నిరాటంకంగా అందిస్తా మని చెప్పి నేడు నిరంతర కోతలు, వాతలు వేస్తున్నారు. ఒక కోటి 89 లక్షల మందికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి 13500 కోట్ల ప్రజలపై ఒక1350 కోట్లు ప్రజలపై భారం వేసి వసూలు చేస్తున్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ఎంత పడితే అంతా, ఎలా పడితే అలా వసూలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాటమీద నిలబడకుండా అన్ని మాటలను వాగ్దానాలను తుంగలో తొక్కి అన్నింట మడమ తిప్పుతున్నాడన్నారు. ఈ సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి- కదిరి ప్రసాదు గౌడ్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో సింహాద్రిపురం భక్తుల సంకీర్తనలు

విశాలాంధ్ర-తొండూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో సింహాద్రిపురం భక్తులు దైవసంకీర్తనలు ఆలపించారు. సింహాద్రిపురం మండలం జంగం రెడ్డిపల్లికి చెందిన శ్రీఆంజ నేయస్వామి భజన మండలి వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో చేపట్టా రు. భక్తిశ్రద్ధలతో సంప్రదాయం బద్ధంగా ఆలపించిన సంకీర్తనలకు అక్కడ భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ భజనమండలి సంకీర్తనలు చూసిన వారం దరూ అదే తరహాలో భక్తి కార్యక్రమాలు నిర్వహించాలనే యోచనకు వచ్చినట్లు తెలిసింది. సంకీర్తనలకు చక్కటి ఆదరణ లభించినట్లు సీనియర్ పాత్రికేయులు యాగంటి బాలకృష్ణారెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

పందుల బెడదతో బెంబేలెత్తుతున్న ప్రజలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని వైయస్సార్ కాలనీ యందు పట్ట పగలే పందుల సంచారం ఎక్కువవు తోంది. దీంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. పందుల సంచా రం ఎక్కువ అవ్వడం వల్ల అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పందులు ఇండ్లలోకి దూరి వస్తువులను పగలగొట్టడమే కాకుండా మురికి నీరు తొక్కి రోత చేస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి పందుల బెడదను తగ్గించాలని వైయస్సార్ కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

రిమాండ్ ఖైదీ కోసం గాలింపు

విశాలాంధ్ర-కొండాపురం: పోలీసుల కళ్లుగప్పి పరారైన అంతరాష్ట్ర దొంగ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేస్తున్నారు. గురువారం కొండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గల కేసునకు సంబంధించి నాగిరెడ్డి ముద్దాయి ఇతను కర్ణాటక రాష్ట్రంలోని దార్వాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండేవాడు. ఇతన్ని కొండాపురం కేసుకు సంబంధించి గురువారం జమ్మలమడుగు కోర్టులో ప్రవేశపెట్టి అనంతరం దార్వాడ జైలుకు తీసుకువెల్తుండగా గురువారం రాత్రి సుమారు 8గంటల ప్రాంతంలో కొండాపురం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు కాలకృత్యాలు తీసుకోవడం కోసం ఆగడంతో నిందితుడు స్టేషన్ గోడదూకి పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. ఇతనిపై సుమారు 90కేసులు దాక ఉన్నట్లు సమాచారం. నిందితుని కోసం పోలీసులు 5టీంలుగా ఏర్పడి ముమ్మరగా గాలింపు చేస్తున్నారు.

జగనన్నా ఆణిముత్యాలకు ఎంపిక

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని స్థానిక ఆంధ్రప్రదేశ్అంబేద్కర్ గుర కుల పాఠశాల, న్యూ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి శివకు రూ.3వేలు నగదు, రెండో బహుమతి చరణ్ తేజకు రూ.2వేలు, మూడో బహుమతి భాను ప్రకాష్ అనే విద్యార్థికి రూ.1 వెయ్యి అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు జగన న్నా ఆణిముత్యాలుగా ఎంపిక చేసి విద్యార్థుల కు ఉత్సాహప రచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికారుల ఆదేశాలతో స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అనంతపద్మనాభ శాస్త్రి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య చేతులమీదుగా విద్యార్థులకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమం లో సుబ్బయ్య, ఉపాధ్యాయులు సుబ్బరామయ్య, బసిరెడ్డి శ్రీనివా సులు రామ్మోహన్, ఉమా, హిదాయతుల్లా,నాగరాజు పాల్గొన్నారు.

ఘన సన్మానం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రామేశ్వరం పాఠశాల నుండి ఇటీవల బదిలీపై బి కోడూరు మండలం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అయ్య వారి పల్లెకు వెళ్లిన గుడిమే ఇన్నయ్యని పాఠశాల ప్రధానోపాధ్యా యులు ముత్తుముల రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకాగా ఈ కార్యక్రమానికి విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి రఘురామిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ముత్తుముల వెంకట్రామిరెడ్డి, బొజ్జ వేణుగోపాలు, సదా లక్ష్మీలు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇన్నయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని ఘనంగా సన్మానించడం జరిగింది.

స్ఫూర్తి ప్రదాత ఎంపీడీఓ సూరి

బదిలీ అధికారికి ఘనసన్మానం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సానేపల్లి సూర్యనారాయణరెడ్డి విధి నిర్వహణలో ఆ శాఖకు స్ఫూర్తి ప్రదాత అని ఎర్రగుంట్ల జడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య కొనియాడారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బదిలీ అధికారి ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డికి ఘన వీడ్కోలు సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బాలయ్య మాట్లాడుతూ సుమారు నాలుగేళ్ల పాటు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడం హర్షనీయమన్నారు. విధి నిర్వహణలో మండల ప్రజల మన్ననలు పొందిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని ఎక్కడ పనిచేసినా ప్రజల సంక్షేమమే ధ్యేయంగా విధులు నిర్వహించే సూర్యనారాయణరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్‌లో సూర్యనారాయణరెడ్డి విధి నిర్వహణలో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని కోరారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారిని ఆప్యాయంగా పలకరించడం వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవడం సూర్యనారాయణరెడ్డి నైజమని గుర్తుకు తెచ్చారు. మండల తాహసీల్దార్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం ద్వారానే లక్ష్యసాధన సులభతరమవుతుందని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా సూర్యనారాయణరెడ్డితో కలిసి పనిచేసిన అనుభవం తనకు ఉందని స్వతహాగా మృదుస్వభావి అయిన సూర్యనారాయణరెడ్డి బదిలీ కావడం ఒకింత బాధగా ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు తప్పవన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డితో కలిసి పనిచేసిన పలు అంశాలను సభలో ప్రస్తావించారు. సభలో నూతన ఎంపీడీవో భాగ్యలక్ష్మీ, ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య, ఏపీఎం జగదీశ్వరి, పంచాయతీ కార్యదర్శులు సాంబశివారెడ్డి, మురళి తదితరులు ప్రసంగించారు. అనంతరం సూర్యనారాయణ రెడ్డిని దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అధికారులు, సిబ్బందితో తనకు ఉన్న సంబంధాలను నెమరవేసుకున్న సూర్యనారాయణరెడ్డి తనకు లభించిన సత్కారం పట్ల పేరుపేరున ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎం.మోహన్‌రెడ్డి, డిప్యూటీ తాహసీల్దార్ లక్ష్మీదేవితో పాటు ఏఓ త్రిమూర్తి రెడ్డి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు విష్ణు, శేఖర్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర
అన్నమయ్య జిల్లా





విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -రాజంపేట: రాజంపేట భవన నిర్మాణం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 20వ తేదీన మహా ధర్నాకు వందల సంఖ్యలో తరలి వెళ్లాలని విజయవాడలో తాడోపేడో తేల్చుకోవాలని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చే చేయాలని కోరుతూ. కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. భవన నిర్మాణం కార్మిక సంఘం. జిల్లా బాధ్యులు గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్మెస్ రాయుడు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది గళ్ళ శ్రీనివాసులు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈ సికిందర్, భవన నిర్మాణం గౌరవ అధ్యక్షులు వెంకటయ్య, కార్మిక సంఘం నాయకులు. వెంకటస్వామి. నన్నే సాహెబ్. పి సుబ్రహ్మణ్యం. రామయ్య. ఈ రమణ. రమేష్ పాల్గొన్నారు.

30 నాటికి నాడు-నేడు పనులు పూర్తికావాలి: జేసీ

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: మనబడి నాడు నేడు రెండో విడత సంబంధించి అన్ని తరగతి గదులు, ఎలక్ట్రికల్, మరుగుదొడ్ల రిపేర్లు, నూతన వంటగది, మరుగుదొడ్ల నిర్మాణాలు జూన్ 30వ తేదీ నాటికి పూర్తీ చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మనబడి నాడు నేడు పనుల పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఫీల్డ్ ఇంజనీర్ లతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.... మనబడి నాడు నేడు పనులు ఆశించినటువంటి స్థాయిలో జరగటం లేదని, పనుల వేగవంతం చేయాలని సూచించారు. నత్తనడకన జరుగుతున్న సంబం ధిత మండలాల అధికారులకు జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు. అందులో భాగంగా రేపటి వారానికి ఎన్ని పనులు పూర్తీ చేయగలరో అందరి నుండి యాక్షన్ ప్లాన్ తీసుకున్నారు. అంగన్వాడీ లలో అదనపు తరగతి గదుల నిర్మాణంలో చోటు చేసుకున్న జాప్యానికి సిడిపీఓల నుండి వివరణ కోరారు. ప్రధానోపాధ్యాయులు మారిన నాడు నేడు పాఠశాలల్లో మూడు రోజుల్లో బ్యాంకు అకౌంట్లు వారి పేరు మీద మార్చుకొని, పనులకు అంతరాయం లేకుండా కొనసాగించి, నిర్దిష్ట సమయానికి పూర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ కార్యాలయ ఏడి ప్రసాద్ బాబు, సీఎంఓ కరుణాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ ప్రసన్న కుమార్, మురళీధర్, డీఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్యశిభిరం

విశాలాంధ్ర-గాలివీడు: ఈ నెల 18 వ తేదీ ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గం. వరకూ ఉచిత కంటి వైద్య సభిరాన్ని నిర్వహిస్తున్నట్లు గాలివీడు గ్రామపంచాయతీ వారు తెలిపారు.మండలకేంద్రంలోని స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి,తిరుపతి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిభిరాన్ని నిర్వస్తున్నట్లు పేర్కొన్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దగ్గర, దూరపు చూపు సమస్యకు ఉచిత పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు.అలాగే కంటి పొర,శుక్లాలు ఉన్నవారికి తిరుపతి అరవింద కంటి ఆసుపత్రికి తరలించి భోజన,వసతి సౌకర్యాలు కల్పించి ఉచిత కంటి చికిత్స చేయిస్తామన్నారు.కంటి సమస్యలు వున్న ప్రతీ ఒక్కరూ ఈ ఉచిత కంటి వైద్య శిభిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరానికి వచ్చు వారు తమ వెంట ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర- గుర్రంకొండ: 2022 2023 సంవత్సరానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడంతో మొదటి ద్వితీయ తృతీయ స్థానాల్లో విద్యార్థులకు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రం సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఏ పీ ఆర్ గురుకుల పాఠశాలలో జడ్పిటిసి ముక్తియార్ సమీన్ చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలతో సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా మంచి మార్కులు సాధించి రాష్ట్రంలో ఉన్నత స్థాయి ర్యాంకులను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నాయని శివశంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వరం జగనన్న విద్యాకానుక

విశాలాంధ్ర-నందలూరు :: పేద విద్యార్థులకు వరం జగనన్న విద్యా కానుక అని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం అరవపల్లిలోని మండల ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్య కనుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ బొమ్మి సాయి కృష్ణ, సచివాలయ కన్వీనర్ నాగభూషణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి.. ఉపాధ్యాయులు వెంకటరమణ విజయలక్ష్మి. కమిటీ మెంబర్ కోటి పాల్గొన్నారు.

విద్యాకానుక పంపిణీ

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లి బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకలను, పిల్లలకు అందజేశారు. పాఠశాల కమిటీ చైర్మన్ యలంకూరి లక్ష్మీ రాజ్యం ప్రధానోపాధ్యాయురాలు జగన్మోహినీ దేవి, కమిటీ చైర్మన్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా పిల్లలు మంచి సౌకర్యాలతో చదువుకోవాలనే ఉద్దేశంతో, పిల్లలకు , మంచి పోషణకరమైన ఆహారం, దుస్తులు, పాదరక్షలు, అందిస్తున్నారని, పిల్లలు కూడా శ్రద్ధతో బాగా చదివి ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉపాధ్యాయులు మొదలగు వారు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల అన్నదానం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ అగ్ర హీరోగా నటించిన అంతర్జాతీయ శ్రేణి టెక్నాలజీతో రూపొందించి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న ఆది పురుష్ సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం శ్రీలక్ష్మీప్యారడైజ్ సినిమా థియేటర్ ప్రాంగణంలో ప్రభాస్, కృష్ణంరాజు ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు గడ్డం చంగల్ రాజు, అధ్యక్షులు ముద్దలూరు సుబ్బరామరాజు ల అద్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అన్నదానానికి తరలి వచ్చిన ప్రజలను, అభిమానులను అదుపు చేయడం ఫ్యాన్స్ కు సాధ్యం కాలేదు.ప్రభాస్, కృష్ణంరాజు ఫ్యాన్స్ ముప్పాల హేమన వర్మ, కొండూరు సుదర్శన్ రాజు, కంపరాజు నాగేంద్రరాజు, ముప్పాల రాజశేఖర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.అన్నదాన కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లె రురల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శివాంజినేయులు కళాశాల లోని ప్రతి క్లాస్ రూమ్ లోని విద్యార్థినిలు తమ మొబైల్ లో దిశా అప్ ఉండేలా ఇన్ స్టాల్ చేయిం చారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడు తూ మహిళల రక్షణ కోసం మన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది అని, ఆపదలో ఉన్న మహిళలకు సాయం అందించేందుకు దిశ యాప్‌ను తీసుకొచ్చింది అని అన్నారు. స్మార్ట్ ఫోన్‌లో ఈ చిన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఆపద సమయంలో చిన్న బటన్ నొక్కితే ఐదు నిమిషాల్లో పోలీసులు స్పాట్‌కు చేరుకునేలా యాప్‌ను తయారు చేశారు అని అన్నారు. ఈ దిశ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫాంలపై అందుబాటులో ఉంది. ఇంటర్నెట్ ఉన్నా.. లేకపోయినా పని చేయడం దీని ప్రత్యేకత అని అన్నారు. ప్రతి విద్యార్థిని మొబైల్ నందు ఈ దిశా అప్ ఉండాలని ఆయన అన్నారు. కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ ముడివేడు ఎస్. ఐ ముబీన్ తాజ్ పాల్గొన్నారు.

ఘన సన్మానం

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లి బాలికోన్నత పాఠశాల నుండి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులు, రెడ్డమ్మ, శ్రీలక్ష్మి, సుజాత, ప్రసన్నలక్ష్మి, శ్రీవల్లి, లను, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, జగన్మోహిని దేవి, పాఠశాల కమిటీ చైర్మన్, యలంకూరి లక్ష్మీరాజ్యం, ఘనంగా సన్మానించారు. కమిటీ చైర్మన్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు, పిల్లలతో, మంచి అనుబంధం ఉండేదని, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తో పాఠాలు నేర్పించేవారు అన్నారు. హెడ్మాస్టర్ జగన్మోహిని దేవి మాట్లాడుతూ బదిలీలు సర్వసాధారణం కాబట్టి, బదిలీపై వచ్చిన కొత్త టీచర్లు కూడా, పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మంచి విద్యా బుద్ధులు నేర్పుతారని ఆశిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించుకుందాం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రం కోడూరు టౌన్ లో అందరి సహకారంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించుకుందామని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కోరముట్ల శ్రీనివాసులు, రాజంపేట డిఎస్పీ వివిఎన్ కే చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే డీఎస్పీ స్థానిక సర్పంచ్ తోట శివసాయి, సిఐ ఎస్ విశ్వనాథరెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్, రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య తదితరులు ట్రాఫిక్ సమస్యపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం టౌన్ లోకి వెళ్లి ఎక్కడెక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నదో ఆ ప్రాంతాల కు వెళ్లి పరిశీలించి చర్చించారు. ప్రధానంగా ఫుట్ పాత్ లు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగించడం వలన, మరో పక్క కూరగాయల బండ్లు, మామిడిపండ్ల వ్యాపారులు, టిఫిన్ అంగళ్లు రోడ్ల పైన వ్యాపారాలు కొనసాగించడం,ఆటోలు ఎక్కడబడితే అక్కడ నిలబెట్ట డం వలన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని గుర్తించారు. పంచాయతీ అధికారులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు అందరూ కలిసి ట్రాఫిక్ నిర్మూలనకు కృషి చేయాలని నిర్ధారణకు వచ్చారు. త్వరలో ట్రాఫిక్ సమస్య ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఏర్పడింది. డ్రైవింగ్ పై పూర్తి అవగాహన లేకే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని రాజంపేట డిఎస్పి వివిన కే చైతన్య నిర్ధారించారు. మరోపక్క మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయ న్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్లు మోహన్ కుమార్ గౌడ్, వెంకటేశ్వర్లు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ముజీబ్, ఎంపీటీసీ పందేటి జనార్ధన్ రాజు, ఆర్టీసీ కంట్రోలర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పఠాన్ ఖలీద్ కుటుంభానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-రామాపురం : మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి స్వగృహంలో నీలకంఠరావు పేట గ్రామ సర్పంచ్ ఆయుబ్ ఖాన్ మరియు గ్రామ ముస్లిం మైనార్టీ నాయుకుల ఆధ్వర్యంలో బుదవారం మృతి చెందిన పఠాన్ ఖలీద్ కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డిని కలిశారు, పఠాన్ ఖలీద్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి పరామర్శించి, ఖలీద్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందచేశారు, భవిష్యత్ లో కూడా పఠాన్ ఖలీద్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని, పిల్లల చదువులకు తన సహాయ సహకరులు అందిస్తాను అని మాజీ ఎమ్మెల్యే గడి కోట ద్వారకనాథ్ రెడ్డి హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో సాగుతోన్న రాక్షస పాలన...

విశాలాంధ్ర-మదనపల్లి: వేంపల్లి పంచాయతీ హరిజన వాడలో జరిగిన సంఘటన. హరిజన వాడకి చెందిన అదేమ్మ, కదిరిప్ప కూతురు స్వాతి పై వైసిపి గుండాలు దాడి చేసి, దుర్భాషలాడి, ఆ అవమానాన్ని భరించలేక అమ్మా యి ఆత్మహత్యాయత్నం చేసుకునే పరిస్థితి కి వచ్చింది. మదనపల్లి జిల్లా ఆసుపత్రి లో జనసేన పార్టీ రాయలసీమ కో కన్వీనర్ గంగరపు రాందాస్ చౌదరి పరామ ర్శించి వారి కుటుంబంకి గ్రామ ప్రజలకి అండగా జనసేన పార్టీ ఉంటుందని హామీ ఇచ్చారు. స్వాతి వైద్య ఖర్చులకి ఆర్థిక సాయం చేశారు. అయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి దగ్గర నుంచి జిల్లా మంత్రి నుంచి ఏమ్మెల్యే నుంచి గ్రామం లో కార్యకర్త వరకు దౌర్జన్యాలు, దాడులు చేయడం జరుగుతుందని పోలీస్ శాఖ వారు వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని అవసరం ఐతే జనసేన పార్టీ తరుపున హైకోర్టు వరకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జంగాల శివరాం రాయల్, గడ్డం లక్ష్మీపతి, రెడ్డెమ్మ, శేఖర, రామక్రిష్ణ, కదిరిప్ప, అదేమ్మ, రవి, శివ, నరసింహులు, వెంకటరమణ, రఘు, నల్లప్ప పాల్గొన్నారు.

ప్రజా సేవకు మారు పేరు లయన్స్ క్లబ్ : సీఐ

విశాలాంధ్ర-రామాపురం : ప్రజాసేవకు మారు పేరు లైన్స్ క్లబ్ అని లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్ అన్నారు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో లయన్స్ క్లబ్ రాయచోటి ఆధ్వర్యంలో ఆది డెంటల్ కేర్ డా.టి.ఆదినారాయణ రెడ్డి ఆర్థిక సౌజన్యంతో రామాపురం పోలీస్ స్టేషన్ కు ట్రాఫిక్ నియమ నిబంధనల ఫ్లెక్సీ లను సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్, ఎస్.ఐ కొండారెడ్డిలకు అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని అన్నారు. అనంతరం సీఐ వరప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలకు ఎక్కడ ఏ అవసరం వచ్చినా మేమున్నా మంటూ ముందుకు వచ్చి సహాయం చేస్తున్నారని అలాగే రామాపురం మండ లంలో కూడా ప్రమాదాలు జరగకుండా చేయడానికి మా పోలీసు స్టేషన్‌కు తమ వంతుగా ట్రాఫిక్ నియమ నిబంధనలు ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సూచిక ఫ్లెక్సీలను మాకు అందజేసినందుకు దాతలక లయన్స్ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. దాత ఆది డెంటల్ కేర్ డా. టి.ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తగు జాగ్రత్తలు పాటించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రమాదాలు తెలిపే పలు రకాల ఫ్లెక్సీలను రామాపురం పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వరప్రసాద్,ఎస్.ఐ కొండారెడ్డిలకు అందజేసినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ బి.ఆనంద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి జాతరకు చమర్తికి ఆహ్వానం

విశాలాంధ్ర-రాజంపేట: మండల కేంద్రంలోని ఊటుకూరు గ్రామపంచాయతీ లో డి బి ఎన్ పల్లెలో ఈనెల 22 23వ తేదీలలో నిర్వహించనున్న అమ్మవారి జాతరకు విచ్చేసి అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులవ్వాలని కోరుతూ శుక్రవారం డి.బి.ఎన్ పల్లె గ్రామస్తులు టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్ రాజును ఆహ్వానించారు. పట్టణంలోని చమర్తి క్యాంపు కార్యాలయం లో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జాతరకు ఆహ్వానించి, వేడుకలకు సహకారం అందించాలని గ్రామస్థులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన జాతర నిర్వహణకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఎన్ పల్లె గ్రామ పెద్దలు ఎం.నరసింహులు, కె.సుబ్బయ్య, చలపతి, గ్రామస్తులు సాంబశివ, సుధాకర్, కళ్యాణ్, మహేంద్ర, కె.శివ, దొరబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రవేటు ఉపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర-గాలివీడు: ఎంతో మం ది విద్యార్థుల కు విద్యా బుద్ధులు నేర్పిన ప్రవేటు ఉపా ధ్యాయుడు ఎల్లంరాజు రాజేంద్ర బాబు(40) అనారోగ్యం తో శుక్రవారం కన్ను మూశారు. మండలం లోని గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లెకు చెం దిన డీలర్ చంగల్ రాజు కుమారుడు రాజేంద్ర బాబు గత పదిహేను సంవత్సరాలకు పైగా పలు ప్రవేటు పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేశారు.హిందీలో విద్వాన్ డిగ్రీ,హిందీ పండిట్ ట్రైనింగ్ పూర్తి చేసి పలు ప్రవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా సేవలందించారు.

సుండుపల్లె బస్‌స్టాండ్ నిర్మాణానికి సహకరిస్తాం

విశాలాంధ్ర-సుండుపల్లె : సుండుపల్లె మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు బస్టాండు నిర్మాణం ఏర్పాటు కోసం ప్రభుత్వం, ఎంపీ, ప్రజా ప్రతినిధుల చొరవ తీసుకొని ఎంపీ నిధుల నుండి 20 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి, బస్టాండు నిర్మాణం చేయడానికి అనుమతులు మంజూరు చేయడం సంతోషదాయకం అని మాజీ జెడ్పిటిసి యర్రపురెడ్డి జయమ్మ శుక్రవారం సుండుపల్లిలో ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఎక్కడ అయినా సరే బస్టాండు నిర్మాణం చేయాలి. అలాగే కలెక్టర్, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, సుండుపల్లి మండలంలోని ప్రజాప్రతినిధులు, అలాగే మండలంలోని ప్రజా శ్రేయస్సు కోరుకునే నాయకుల అందరి చొరవతో బస్టాండ్ నిర్మాణం పూర్తి అయి మండల ప్రజలకు మంచి జరగాలనీ ఆకాంక్షించారు. తమ కుటుంబం తరఫున పది లక్షల రూపాయల చెక్కును సుండుపల్లె బస్‌స్టాండ్ నిర్మాణ శంకుస్థాపన రోజున ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. సుండుపల్లె మండలం ఉమ్మడి కడప జిల్లాలో అత్యంత పెద్ద మండలం సుండుపల్లి మండలంలో సుమారు 250 పై చిలుకు పల్లెలు ఉన్నాయి. లక్ష జనాభా కలిగిన మండలంలో ఇప్పటివరకు సుండుపల్లికు బస్టాండు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో బస్టాండు నిర్మాణానికి అనుమతులు రావడం సంతోషదాయకంగా ఉందన్నారు. బస్టాండు నిర్మాణం పూర్తి అయ్యి మండలం లోని ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం ఏర్పడితే ప్రజలందరికీ మేలు చేకూరుతుందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం మా కుటుంబం ఎప్పుడు పనిచేస్తుందని చివరి రక్తపు బొట్టు వరకు ప్రజల కోసం పనిచేయాలని, స్వాతంత్ర సమరయోధులు మా మామగారు యర్రపురెడ్డి ఆదినారాయణ రెడ్డి ఆశీస్సులతో.. స్వర్గీయ మాజీ రెస్కో చైర్మన్ నా భర్త రవీంద్రారెడ్డి ఆశయాల కోసం నా తనయుడు అజయ్ కుమార్ రెడ్డి మరియు కుటుంబం పనిచేస్తుందని పత్రిక ముఖ్యంగా సుండుపల్లి మండలంతో పాటు జిల్లా ప్రజలకు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. సుండుపల్లి మండల అభివృదే లక్ష్యమన్నారు. మండల ప్రజలకు మంచి జరుగుతుంది అంటే తాము అన్నివేళలా ముందుంటామని అన్నారు. బస్టాండు నిర్మాణం పూర్తి అయి రవాణా సౌకర్యం మెరుగుపడితే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని స్వయంగా కలిసి సుండుపల్లెతో పాటు నియోజకవర్గ జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేస్తామన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన సిఎం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొ చ్చారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. శుక్రవారం గవర్నమెంట్ హైస్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమములో ముఖ్య అతిథిగా పాల్గొని పదవ తరగతిలో, ఇంటర్మీడియట్లో అత్యధిక మార్కు లు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి 15,000, రెండో బహుమతి 10,000, మూడవ బహుమతి 5000 నగదు బహుమతితో పాటు మెడల్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఎంఇఓలు రామయ్య (కోడూరు), మహేశ్వరరావు (చిట్వేల్), రంగనాధయ్య (పుల్లంపేట), జయవేలు (పెనగలూరు), సర్పంచ్ దార్ల చంద్రశేఖర్, ఉపసర్పంచి యజ్జం చంద్రశేఖర్, తల్లిదండ్రుల విద్యా కమిటీ చైర్మన్ పల్లా దామోదర్, హైస్కూల్ ఇన్చార్జి చంగల్ రెడ్డి, రాజంపేట డివిజన్ బిసి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బత్తల సుబ్రమణ్యం, వైసిపి నాయకులు కంచర్ల రమణారెడ్డి, దామర్ల సిద్దయ్య డివి రమణ, నగిరిపాటి మణి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి: కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం కి చెందిన ఎంపీపీ విజయలక్ష్మి పై దాడి కి పాల్పడిన గిరిజన నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. గిరిజన మహిళ అయిన రౌతులపూడి ఎంపీపీ విజయలక్ష్మి ప్రాథమిక ఆరోగ్య కెంద్రానికి చైర్మన్గా వ్యవహరిస్తున్నారు. పీహెచ్సీ ప్రారంభోత్సవానికి ఆమెను ఆహ్వానించకపోగా ప్రశ్నించినందుకు ఎంపీపీ విజయలక్ష్మిపై దాడికి పాల్పడం ఎంతవరకు సమంజసమని సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. గిరిజన తెగకు చెందిన మహిళ ఎంపీపీ స్థానంలో ఉన్నప్పటికీ ఆమెకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోగా ప్రశ్నించడాన్ని తట్టుకోలేక దాడులకు పాల్పడడం రాజ్యాంగాన్ని అపహస్యం చేసినట్లు అని ఆయన మండిపడ్డారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీ మేస్త్రీ, సెంట్రింగ్, రాడె బెండర్, పరంజీ, కార్పెంటర్, ఎలక్ట్రీషన్, పెయింటర్స్, ప్లంబింగ్, మార్బుల్, టైల్స్, కాంక్రిట్, మట్టిపని తదితర భవణ నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ళ శ్రీనివాసులు కోరారు. ఈ నెల 20వ తేదీన భవణ నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విజయవాడ లో తలపెట్టిన మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం రాయచోటి పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ 2006లో ప్రారంభమైన సంక్షేమ బోర్డులో అప్పటి పాలకులు రాష్ట్రంలో 22 లక్షల మంది కార్మికులను నమోదు చేసుకొని వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి 11 రకాల సౌకర్యాలను లేబర్ ఆఫీసు ద్వారా అమలు చేసేవారన్నారు. అమలులో కొన్ని లోపాలు ఉన్న వాటిని అప్పటి పాలకుల దృష్టికి తీసుకొనిపోతే పరిష్కరించేవారన్నారు. కానీ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై నిర్లక్ష్యం వహించటమే కాకుండా దశాబ్దాలుగా పోరాడి సాధించుకొన్న సంక్షేమ బోర్డు 1996ను నిర్వీర్యం చేస్తు సర్క్యులర్ నెంబర్ జారీ చేసి భవన్‌నిర్మాణరంగకార్మికులను కష్టాలపాలు చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు వరం జగనన్న విద్యాకానుక

విశాలాంధ్ర-పీలేరు: జగనన్న విద్యాకానుక విద్యార్థులకు ఓ వరం లాంటిదని పీలేరు సర్పంచ్ హబీబ్ బాషా అన్నారు. ఆయన చేతుల మీదుగా శ్రీనాథపురం పాఠశాల మరియు కోటపల్లి ప్రధాన పాఠశాల లో .పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా హబీబ్ బాషా మాటలాడుతు వైసీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని ఇచ్చిన హామీలు 99% పూర్తి చేశామని అన్నారు. అనంతరం బండ్లవంక వద్ద 4 వీధులకు కొత్త నీటి పైపులైన్ ఏర్పాటు చేశారు.అలాగే కౌసర్ మసీదు నందు నూతన పైప్ లైన్ ఏర్పాట్లు చేసి నీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.శ్రీనాథపురం పాఠశాల మరియు ప్రధాన పాఠశాల. వార్డుమెంబర్లునాగభూషణం, అభిద్, నాగరాజ, ఉదయ్, ఎంపీటీసీస్ ఇబ్రహీం, జోహార్,మండల్ కో ఆప్షన్ సభ్యుడు రెడీబాషా, ఎంయంసి డైరెక్టర్లుమునీర్,కాలనీ చిన్న, మద్దిరాల మల్లికార్జున్,హెడ్ మాస్టర్ రహత్, సురేంద్ర రెడ్డి,ఈఓ ప్రసాదరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,2,5 పంచాయితీ కార్యదర్శి పద్మనాబం, సహదేవరెడ్డిలు పాల్గొన్నారు.

మలేరియాకు నివారణ చర్యలు తప్పని సరి

విశాలాంధ్ర-పీలేరు: మలేరియా వ్యాధి నియంత్రణకు, ముందుస్తూ తీసుకునే నివారణ చర్యలు చక్కటి ఫలితాల్ని ఇస్తాయని,హెల్త్ ఎడ్యుకేట ర్ కొండయ్య అన్నారు. శుక్రవారం తలపుల పీ.హెచ్.సి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ రెడ్డి ఆదేశాల మేరకు, మలేరియా నివారణ మాసోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా "మలేరి యా నివారణ అందరి బాధ్యత" అంశముపై,గూడరేవుపల్లె గ్రామ ప్రజలకి అవగాహన కార్యక్రమం వహించడమైనది.మలేరియా వ్యాధి జూన్ నెల నుండి అక్టోబర్ నెల మధ్యకాలంలోనే వ్యాప్తి చెందునని, మలేరియా వ్యాధి కారక క్రిమిని రోగినుండి , ఆరోగ్యవంతుడికి చేరవే యుటకు ఆడ అనఫీలస్ దోమ ప్రధాన కారణమని,రోజు విడిచి రోజు జ్వరము, తలనొప్పి, వణుకుతో కూడిన చలి జ్వరం మరియు చెమటలు మొదలగు లక్షణాలతో బాధపడుచున్నచో, దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత రక్తపరీక్షల ద్వారా వ్యాధినిర్ధారణ చేసుకుని తదుపరి రాడికల్ చికిత్స ద్వారా నివారణ పొందాలని, ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా,దోమ తెరలు వాడాలని,కిటికీలకు మెస్స్ బిగించాలని, ఇంటి బయట లోపల నీటి నిలువలు నివారించాలని, కొండయ్య ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏ.ఎన్.ఎం.పామున్నిసా, సి. హెచ్.ఓ/ఎం.ఎల్. హెచ్.పి. లావణ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టండి

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డికి మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱం నారాయణ మరియు బృందం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గుఱ్ఱం నారాయణ మాట్లాడుతూ పీలేరులోని రెవెన్యూ,పోలీసు, జ్యుడీషియల్, సబ్ రిజిస్టర్,ఎంపీడీవో,వెలుగు, ఉపాధి హామీ, ఏపీడీసీఎల్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్,ప్రభుత్వ హాస్పిటల్ లలో మరుగుదొడ్ల నిర్మాణాలు లేవని ముఖ్యంగా ఈ ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతిరోజు మహిళలు,వృద్ధులు, పిల్లలు దివ్యాంగులు తరచూ వారి వారి సమస్యలపై కార్యాలయాలకు వస్తుంటారని మరుగుదొడ్లు లేకపోవడం వల్ల వారి పరిస్థితి అగ్యమ గోచరంగా తయారైందని ఇప్పటికైనా పీలేరు శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి స్పందించి వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో మహిళల కోసం ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుఱ్ఱం నారాయణ కోరారు.

జగనన్న సురక్ష కార్యక్రమం పై ప్రత్యేక ఫోకస్ పెట్టండి:జెసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పేరుతో కొత్త కార్యక్రమాన్ని తలపెట్టిందని, ఈ కార్యక్రమం పై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ లో జగనన్న సురక్ష కార్యక్రమం పై సంబందిత అధికారులతో జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23 వ తేది నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమై వచ్చే నెల 23 వ తేది వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పై సచివాలయం, వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. అధికారులందరు చాలెంజ్ గా తీసుకొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఏ సమస్యలు ఉన్నా వెంటనే వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు సంబంధించిన పత్రాలు, సర్టిఫికేట్ లు ప్రభుత్వ పథకాల సమస్యలు ఉంటె వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ పనుల నిర్వహణ కోసం మండల అధికారులు ఎక్కడికక్కడా క్యాంపులు నిర్వహించి తక్షణం పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఓ, డిప్యూటి తాహసీల్దార్ ఒక బృందంగా, ఎంఆర్ఓ, ఈఓపిఆర్ డి మరో బృందంగా, పురపాలక సంఘాల స్థాయిలో కమీషనర్ నేతృత్వంలో ఒక బృందంగా వారి పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో పర్యటించాలన్నారు. ఏ సచివాలయం పరిధిలో ఏ తేదిలో పర్యటిస్తారో ముందే నిర్ణయించి ఆ తేది నాటికల్లా సచివాలయ పరిధిలో సిబ్బంది అవసరమైన మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. డాక్యుమెంటేషన్, సర్టిఫికేట్లు, ప్రభుత్వ పథకాలు, అర్హతలు తదితర వాటికి సంబం ధించి మండల స్థాయిలో శిబిరాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ సత్యనారాయణ, ఆర్.డి.ఓ లు రంగస్వామి, మురళి, భాష్కర్, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై మామిడి రైతులకు శిక్షణ

విశాలాంధ్ర- రామాపురం : మామిడి రైతులకు సస్యరక్షణ సమగ్ర యాజమాన్య పద్ధతులపై శుక్రవారం మామిడి రైతులకు ఉద్యాన శాఖ అధికారి నాగమణి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మండలంలోని సుద్దమల్ల , నల్లగుట్టపల్లి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తర్వాత ఆచరించవలసిన సస్యరక్షణ సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మామిడి లో కాయలు కోసినప్పటి నుండి తగు జాగ్రత్తలను పాటించినట్లైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15-20 రోజులు చెట్లకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచంచారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్య రష్మి , గాలి లోపలికి ప్రసరించెల తలపైన కొమ్మలను, తూర్పు పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల , చీడపీడలు ఆశించిన కొమ్మలు , తొడిమ కొమ్మలను, ఎండి పోయిన పూత కాడలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి చెట్లు పూర్తిగా తడిచెల 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలి. దున్నకాలు చేపట్టడం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి తేమ శాతం పెంచడం జరుగుతుందన్నారు. 10 సంవత్సారాలు పైబడిన చెట్లకు వర్షాధారం తోటల్లో ప్రతి చెట్టుకు 2 కిలోల యూరియా , 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 1.5 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నీటి వసతి కల్గిన తోటల్లో 1 కిలో యూరియా , 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి. పిందెలు గోలీ సైజులో ఉన్నప్పుడు మిగతా 1 కిలో యూరియా 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. ఎరువులను చెట్లకు 4-5 అడుగుల దూరంలో చేసిన గాడిలో వేసి మట్టిలో కలిపి నీరు పారించాలి. జులై లో పచ్చిరొట్టే పైర్లయిన జనుము, జిలుగా, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటరు నీటికి లేదా ఫార్ములా-4 పొడిని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలని వివరించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్దతిని పాటించలన్నారు. ఈ కార్యక్రమం నందు రైతు భరోసా కేంద్ర సిబ్బంది ప్రవీణ్ కుమార్ రెడ్డి , లక్ష్మి దేవి , వీణా వాణి మరియు రైతులు పాల్గొన్నారు.

అంగన్ వాడీలకు ఎన్నికల ముందు హామీలు అమలు చేయాలి

కడపలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులలో సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు కడప జిల్లా పరిషత్ మెయిన్ హాల్ నందు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులు ప్రారంభ ఉపన్యాసం సిఐటియు రాష్ట్ర నాయకులు వి రాంగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా అంగన్వాడీల సెంటర్లలో పాఠశాలలను అనుసంధానం చేయడం వలన అంగన్వాడీల వేతనాలు పెరగకుండా భద్రత లేకుండా పోతుందని ఆయన తెలిపారు. గౌరవ వేతనం కాకుండా కనీస వేతనం అమలు చేస్తామని చెప్పి నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం నేడు ఊసే లేదన్నారు. గతంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం గుర్రాలతో తొక్కించి ఇప్పుడు అంగన్వాడీలను ఆదుకుంటామని చెప్పడం ఎన్నికలలో లబ్ది కోసమేనని ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నదని ఆ విధానాన్ని టిడిపి వైసిపి ఢిల్లీలో బలపరిచి రాష్ట్రంలో మాత్రం అంగన్వాడీల విద్యారంగాన్ని ఎట్లా కాపాడుతారని ఆయన ప్రశ్నించారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలకు ఉద్యుతం చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే విధంగా బడ్జెట్లో నిధులు తగ్గించిదని ఆయన తెలిపారు. ఐసిడిఎస్‌ను ప్రవేట్ సంస్థలకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోమని ఆందోళన పోరాటాల ద్వారా తిప్పికొడతామని ఆయన హెచ్చరించారు. ఈ శిక్షణ తరగతులలో అంగన్వాడీ వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు సుప్రజ, చందన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి లక్ష్మీదేవి, ఆర్ లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బి మనోహర్, ఉపాధ్యక్షులు జి చంద్రశేఖర్, మహిళా సంఘం ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్యతో పాటు వివిధ జిల్లాల నుండి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖబడ్దార్ గుట్కా నాని

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : గుడివాడ మీటింగుకు ప్రజలను మీటింగ్‌కు రాకపోతే పథకాలు ఎత్తేస్తాం అని భయపడించి కొంతమంది పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చుకుని చుట్టూ బార్కెట్లు పెట్టి పోలీసులు కాపలా పెట్టుకుని గుట్కా నాని మాట్లాడుతూ మా జగన్మోహన్ రెడ్డి భూమి కొని 30 లక్షలు పట్టాలిచ్చి ఇల్లు కటిస్తున్నాడు అని మాట్లాడాడు. కడప సిటీ టిడిపి ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ మీకు మీ ప్రభుత్వానికి ఆ మాట మాట్లాడే అర్హత లేదు ఎందుకంటే రాష్ట్రంలో ఎస్సీలు ఎస్టీలు ఎప్పటినుంచో సాగు చేసుకునే భూములను నీ జగన్మోహన్ రెడ్డి లాక్కొని కొంతమంది పేద రైతుల దగ్గర మీ నాయకులు తక్కువ రేటుకు కొని గవర్నమెంట్ కు ఎక్కువ రేటు అమ్మి ఆ డబ్బును మీ నాయకులు జేబుల్లో వేసుకున్నారు. కొన్ని స్థలాలు అడవిలో స్మశానంలో గుట్టల్లో చెరువుల్లో ఒక సెంటు స్థలం ఇచ్చి మీ వాలంటీలను పంపించి లబ్ధిదారుల మీద పడి కట్టుకోండి కట్టుకోండి అని లేదంటే పట్టా వెనక్కి తీసుకుంటామని బెదిరిస్తూ ఒకవేళ వాళ్ళు ఎక్కడో ఒక దగ్గర ఐదు రూపాయలు పది రూపాయలు వడ్డీకి అప్పు తెచ్చుకొని ఇల్లు కట్టుకుంటుంటే అక్కడ నీరు లేదు కరెంటు లేదు రోడ్లు లేవు దానిలో 1,50,000 సెంట్రల్ గవర్నమెంట్ డబ్బులు ఇస్తుంది మీ ప్రభుత్వం లబ్ధిదారుడికి ఏమిచ్చారు. ఆ ఇల్లు పూర్తి కావాలంటే కనీసం 10 లక్షలు అవుతుంది. ఆ డబ్బుకు వడ్డీ కట్టుకోలేక ఆ ఇల్లు కట్టుకున్నాము అని సంతోషం లేక ఎంతో మంది ఎన్ని బాధలు పడుతున్నారో మీ వాలంటర్ ని అడగండి చెప్తారు. అదేవిధంగా మా చంద్రబాబు నాయుడు టిట్కో ఇండ్ల పేదలకు కట్టారు కిట్కోయిన్లు పెద్ద భూకంపం వచ్చిన ఇంచ్ కూడా క్రాకురాని విధంగా పూర్తి వెంటిలేషన్ పిల్లలు ఆడుకునేకి ఓపెన్ ప్లేస్ విశాలమైన రోడ్లకు ప్లేస్ ఇప్పుడు కోటీశ్వరులు కట్టుకునే విధంగా కాంక్రీట్ గోడలు విపివిసి విండోస్ 2 బై టు సెరామిక్ టైల్స్ లగ్జరీ స్పెసిలిటీస్ కట్టి పేదవారికి మేము ఇస్తుంటే మా కర్మో ప్రజల కర్మో మా ప్రభుత్వం రాకపోవడం అవి ఆగిపోవడం జరిగింది. మా నాయకుడి కాళ్ల పట్టుకొని బి ఫామ్ తెచ్చుకుని రాజకీయాల్లోకి వచ్చి ఆయననీ నోటికొచ్చినట్లు మాట్లాడతావా నీవు ఎవరిని చూసుకొని అంత ధైర్యంగా మాట్లాడుతున్నావో త్వరలోనే మా నాయకుడు అంటే ఏంటో నీకు రుచి చూపిస్తాము గుర్తుపెట్టుకో గుట్కా నాని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కోయిలకుంట శ్రీనివాసులు డివిజన్ ఇంచార్జిలు బండి జయ శేఖర్ కొండ్రెడ్డి జనార్దన్ రెడ్డి పుట్టుపోయిన శ్రీనివాసులు షేక్ అబిద్ షేక్ ఆరిఫ్ 29 డివిజన్ ఉపాధ్యక్షులు గౌస్ పీర్ ఏజాన్ భాష మైనుద్దీన్ పాల్గొన్నారు.

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి :జెసి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు , జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సలహా మండలి సమావేశంలో లేవనెత్తిన సమస్యలన్నీ కూడా అధికారులు నోట్ చేసుకొని ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందివ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్లో సాగుకు అవసరమైన అన్నిరకాల నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తి, విస్తీర్ణమును గణనీయంగా పెంచండి: చిరుధాన్యాల ఉత్పత్తి, విస్తీర్ణమును గణనీయంగా పెంచాలని స్టేట్ హార్టికల్చర్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ సంబటూరు ప్రసాద్ రెడ్డి వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులను సూచించారు. పశువులకు సోకుతున్న లంపి స్కిన్ పట్ల పాడి పాడిపశువుల యాజవానులు అప్రమంతంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో పశు వైద్యులు సకాలంలో వ్యాక్సినేషన్ అందించాలన్నారు. ఇంకా లంపి స్కిన్ వ్యాధి ఉన్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పసుపు పంట పండించిన రైతుల ఉత్పత్తిని మద్దతు ధరకు త్వరితగతిన కొనుగోలు చేయాలని మార్కెటింగ్ శాఖ ఎడిని ఆదేశించారు. ఆర్బికెలలో ఎరువుల కొరత లేకుండా సకాలంలో సరఫరా చేయాలన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వ అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల పట్ల అవగాహన కల్పించి, ఆ పథకాలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ జెడిని సూచించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. డాక్టర్ వైయస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుంది అన్నారు. రైతుకు వెన్నుదన్నుగా ఉండండి: రైతుకు వెన్నుదన్నుగా ఉండాలని వ్యవసాయ మరియు అనుబంధ రంగాల అధికారులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి తెలిపారు. పీలేరులో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్ ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రైతులకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు అర్హులైన రైతులకు సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. వ్యవసాయ భూములకు సబ్సిడీ కింద సోలార్ ఫెన్సింగ్ అందించాలని వారు కోరారు. పంట సాగులో విత్తనం మొదలు దిగుబడి వరకు అన్ని దశల్లో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ జరగాలన్నారు. గ్రామాల వారీగా ఆర్బికేల పరిధిలో వ్యసాయ సహాయకులు సీజన్ వారీగా ఆయా ప్రాంతాల్లో పండించే పంటలు, వాటికి ఆశించే చీడపీడలు, పైర్లకు అందాల్సిన పోషక విలువలు, ఎరువుల వాడకంపై ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అందరూ భాగంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్రబాబు, సిరికల్చర్ జిల్లా అధికారి రాజశేఖర్, ఏపీఎంఐపి పిడి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖ జెడి గుణశేఖర్ పెళ్లై డాక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు దీన్నేపాడు రవిరాజు, బోదశ వలి తదితరులు పాల్గొన్నారు.

భూమి కోల్పోయిన రైతులకు నష్టపోయిన పరిహారం అందిస్తాం:ఆర్డీవో

విశాలాంధ్ర- రామాపురం : ఎత్తిపోతల పథకంలో భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తామని అన్నమయ్య జిల్లా ఆర్డీవో రంగస్వామి అన్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎత్తిపోతల పథకంలో భూసేకరణ లో భూమి కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కల్ప నాయుని చెరువు. గోపగుడిపల్లి. గువ్వల చెరువు. హసనాపురం గ్రామాలలో ఎత్తిపోతల పథకం కింద 150 మంది రైతులకు గాను 23 ఎకరాలు ఎత్తిపోతల పథకానికి భూసేకరణ సేకరించడం జరిగిందని అన్నారు. ఈ భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులకు గ్రామంలో 20 మంది రైతులకు 4-50 ఎకరాలు 5 లక్షల రూపాయల చొప్పున గోపగుడిపల్లి గ్రామంలో 87 మంది రైతుల గాను 12 ఎకరములు గువ్వల చెరువు రైతులు 2-18 ఎకరములు హసనాపురం 87 మంది రైతులకు సంబంధించి 5 ఎకరాలు. ఈ మూడు గ్రామాల్లో ఆరు లేక ఏడు లక్షలు చొప్పున ఎకరాకు నష్టపరిహారం అందే విధంగా జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతామని రైతులకు సూచించారు. ఎత్తిపోతల పథకానికి భూసేకరణకు ఇచ్చిన రైతులకు ఏ రైతుకు అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్. మండల సర్వే నాగలక్ష్మి ఆయా గ్రామాల సచివాలయ సర్వేలు. ఆర్ ఐ రవికుమార్. ఇరిగేషన్ ఏ ఈ మహబూబ్ బాషా వీఆర్వోలు. సుబ్బారెడ్డి. ఫాతిమా. ప్రేమ సాగర్. నాగేంద్రర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటిని సైతం వదలని వైసీపీ దొంగలు

- మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రవ్యాప్తంగా వైసిపి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు,నాయకులు మట్టి మాఫియా ఇసుక మాఫియా మద్యం మాఫియా డ్రగ్స్ మాఫియాలకు పాల్పడుతూ కోట్ల రూపాయలు అక్రమ మార్గాల ద్వారా కొల్లగొడుతున్నారని రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్,మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం అయన రాయచోటి టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా వైసిపి నేతల అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు అడ్డు,అదుపు లేకుండా పోయిందన్నారు. ఈ క్రమంలోనే అన్నమయ్య జిల్లా పరిధిలో తాగునీటి మాఫియాకు తెరలేపారన్నారు. 2019-20 సంవత్సరంలో అప్పటి ఉమ్మడి జిల్లాలో రాయచోటి-లక్కిరెడ్డిపల్లె ఆర్డబ్ల్యూఎస్ డివిజన్ల పరిధిలోని 8 మండలాల్లో సుమారు రూ.4 కోట్ల 30 లక్షలకు పైగా తాగునీటి సరఫరా చేసినట్లు బిల్లులు పెట్టడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో నిజంగా తాగునీటిని సరఫరా చేసి ఉంటే అప్పట్లో కడప జిల్లా కలెక్టర్లగా ఉన్న హరి కిరణ్,విజయరామరాజులు ఎందుకు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఇవ్వలేదో,ఎందుకు బిల్లులు పెట్టలేదో చెప్పాలని ఆయన వైసిపి నేతలను సూటిగా ప్రశ్నించారు. ఉమ్మడి కడప జిల్లాలో ఉన్న సమయంలో 2019-20 లో తాగునీటిన సరఫరా చేసినట్లు వైసిపి నేతలు దొంగ బిల్లులు సృష్టించి జిల్లా విభజన అనంతరం అన్నమయ్య జిల్లా కలెక్టర్ చేత అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేయించుకోవాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయో చెప్పాలన్నారు. ఎప్పుడో నాలుగు సంవత్సరాల క్రితం మేము ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి అందించాం అంటూ నేడు బిల్లులు పెట్టుకోవడం,ఒక్క లక్కిరెడ్డిపల్లి లోనే రూ.1 కోటి 20 లక్షలకు పైగా నీటిని సరఫరా చేసినట్లు బిల్లులు పెట్టడం వైసిపి నేతల అవినీతికి పరాకాష్ట అన్నారు. తాగునీరు లేని ప్రాంతాలను గుర్తించి నీటిని అందించామని చెబితే అర్థం ఉంది కానీ,సమృద్ధిగా నీరు ఉన్న ప్రాంతాలకే వందల టిప్పులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించామంటూ దొంగ బిల్లులు పెట్టుకోవడం,వాటికి అధికారులు సహకరించడం దారుణం అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఇసుక, మట్టి, ఎర్రచందనం, డ్రగ్స్, మద్యం ఇలాంటి సహజ వనరుల మాఫియాలకు పాల్పడుతున్న వైసిపి నేతలు తాజాగా తాగునీటి మాఫియాకు కూడా పాల్పడడం,వైసీపీ నేతలు పెట్టిన దొంగ బిల్లులకు ఈ ప్రభుత్వం బిల్లులు చేసేందుకు సిద్ధపడటం చూస్తే కార్యకర్తలకు అప్పనంగా దోచి పెట్టేందుకు ముఖ్యమంత్రి జగన్ అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. అడ్డదారుల్లో చేయని పనులకు బిల్లులు చేసి అప్పనంగా వైసిపి నాయకులకు కార్యకర్తలకు డబ్బులు ఇస్తే రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి జగన్ ఆలోచిస్తున్నారని విమర్శించారు. నిజంగానే తాగునీటి సరఫరా చేయలేదని దొంగ బిల్లులు సృష్టించుకున్నారన్న కారణంగానే గతంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న కలెక్టర్లు ఈ బిల్లులకు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇవ్వకుండా మొఖం చాటేసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా కలెక్టర్ పై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చి 2019-20 సంవత్సరంలో తాగునీటి సరఫరా చేసినట్లు బిల్లులు పెట్టి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ చేయించుకున్నారంటే అధికార యంత్రాంగం ఎంతటి దౌర్భాగ్య స్థితిలో ఉందో మనం తెలుసుకోవచ్చునన్నారు. నీటి సరఫరా చేయకుండానే సరఫరా చేసినట్లు అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ పొందిన ఈ నీటి మాఫియాపై టిడిపి పార్టీ తరఫున విజిలెన్స్ విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా హైకోర్టులో కూడా కేసు వేస్తామని ఆయన అన్నారు. పోస్ట్ ఫ్యాక్టో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ పేరుతో తాగునీటి సరఫరా చేయకుండానే బిల్లులు పెట్టిన వైనంపై విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదర్ వలీ,పెమ్మాడపల్లి సర్పంచ్ పల్లపు వాసు,చిట్లూరు గ్రామ నాయకులు గౌడ్,మాజీ సర్పంచ్ బసయ్య రామాపురం మండల తెలుగు యువత అధ్యక్షులు వి నాగభూషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అనర్హులకు ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్ లు, పట్టాలు ఇవ్వడం దారుణం

ఆయిల్ మిల్ భూ అక్రమాలపై హైకోర్టు ను ఆశ్రయిస్తాం
తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తేలుస్తా ఒక్కరిని వదిలిపెట్టం
రెవెన్యూశాఖ అధికారులపై మండిపడ్డ టీడీపీ జాతీయనేత నల్లారి



విశాలాంధ్ర -పీలేరు :-తిరుపతి రోడ్డుమార్గం నూనె విత్తుల కర్మాగారం సంబంధించిన ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలను అనర్హులకు ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్,ఇంటిపట్టాలు ఎలా ఇస్తారు అంటూ రెవెన్యూశాఖ అధికారులపై తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఆయన తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో విలేఖర్లతో సమావేశం అయ్యారు. కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,సంబంధం లేనివారు ఇతర మండలాల నుండి వచ్చి ఇష్టానుసారంగా ఒక్కరొక్కరు నలభై నుండి వంద అంఖనాలు కబ్జాలకు పాల్పడు తుంటే రెవెన్యూశాఖ అధికారులు నిమ్మకునీరెత్తేలా చూసి చూడనట్లు నిర్లక్ష్యంగా ఉన్నారంటే మీ మౌనమేంటో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి కొండలు,గుట్టలు, బండ ప్రాంతాల్లో సెంటున్నర భూమి తీసుకొని అప్పులు చేసి వేలకు వేలు ఖర్చు పెట్టుకొని చదును చేసుకొంటున్న వారి బాధలు వర్ణనాతీతంగా మారాయని, అనర్హులు మాత్రం వంద అంఖనాలు ఆక్రమించుకొని ప్యాలెస్ లు నిర్మించినా ప్రశ్నించేవారు కరువ య్యారని, ఇదెక్కడి చట్టమో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానికంగా రేషన్ కార్డులు లేవు,ఆధార్ కార్డులు లేవు,ఎలాంటి సంబంధాలు లేని వారంతా ఇక్కడ విలువైన భూములు యథేచ్ఛగా ఇండ్లు నిర్మిస్తుంటే చోద్యం చూస్తున్న అధికారులకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకివస్తే ఎంతటి వారినైనాసరే ఏవక్కరిని వదిలిపెట్టమని హెచ్చరిం చారు. సుమారు ఐదునుండి పది ఎకరాల వరకు ఆక్రమణకు గురైనట్లు తెలుస్తుందని రెవెన్యూ సిబ్బంది ఫీల్డ్ మీదుకు వెళ్లే పరిస్థితి లేదని అన్నారు. లైన్స్ క్లబ్ వారు కూడా ఇల్లీగల్ గా అక్కడ నిర్మించడం తప్పని లీగల్ గా ఎక్కడ నిర్మించు కొన్న తమకు అభ్యంతరం లేదని అన్నారు. నాలుగు రోజులక్రితం భూ అక్రమాలకు పాల్పడు తున్నారని స్వయంగా తమ కార్యకర్తలతో అక్కడికి వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టడం జరిగిందని పత్రికల్లో టీవీ చానళ్లలో షోషల్. మీడియాలో రాష్ట్రమంతా కోడై కూసిన రెవెన్యూ శాఖ యంత్రాంగం ఫీల్డ్ మీద కూడా రాలేదంటే మీ పాత్ర ఏమిటో అర్థమైందని అన్నారు. వైకాపా మంత్రులు ఎంపీ,ఎమ్మెల్యే ల అండతోనే భూ కబ్జాదారులు రెచ్చి పోతున్నారని అన్నారు. శ్రీకృష్ణదే వరాయులు నూనె విత్తుల కర్మాగారం ప్రభుత్వభూములపై, అక్రమ నిర్మాణాలు, భూఅక్రమాలవెనక ఎందరున్నారో, ఎవరెవ రున్నారో హైకోర్టు ను ఆశ్రయించి, ఎవరిపాత్ర ఎంతఉందో తేలుస్తామని అన్నారు. పీలేరు పట్టణ శివారుల్లో రోజురోజుకు పెరుగుతున్న భూఅక్రమాలపై అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తున్న అధి కారులపై చర్యలు తప్పవని తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే అందరి లెక్కలు తెలుస్తామని అన్నారు. పీలేరు పట్టణం, శివారుల్లో జరుగుతున్న భూకబ్జాలపై కరపత్రాలు ముద్రించి ఇంటింటికి తిరిగి పంచుతామన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

విశాలాంధ్ర-మదనపల్లి రురల్: పట్టణంలోని కమ్మగడ్డ ఎక్స్టెన్షన్ లో కాపురముంటున్న ఎస్ తేజస్విని ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్బిఐ కాలనీలో కాపురం ఉంటున్న మధుసూదన్ నాయుడు కుమారుడు రామ్ చరణ్ నాయుడు పై మరియు అతని తల్లి శ్రీమతి మధుర.అతని అన్న నాగేష్ వదిన ప్రియాంక అతని స్నేహితులు ఫారుక్ సులేమాన్ బాలు వారందరిపై .కేసు నమోదు చేసినట్లు సిఐ తెలియజేశారు.వివరాల మేరకు మదనపల్లి పట్టణంలోని కమ్మగడ్డ ఎక్స్టెన్షన్ లో కాపురం ఉంటున్న ఎస్ తేజశ్రీకి ఎస్బిఐ కాలనీలో కాపురం ఉంటున్న రామ్ చరణ్ నాయుడు పది నెలల క్రితం పరిచయం అయ్యాడని ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించి బెంగళూరు మరియు పరిసర ప్రాంతాలకు తనతో పాటు తీసుకుని వెళ్ళినాడని.అతని స్నేహితుల ద్వారా కూడా తనను తప్పకుండా పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని ఇప్పుడు పెళ్లి చేసుకోమని తేజశ్రీ అడగగా కులం పేరుతో దూషించినాడని అంతేకాకుండా రామ్ చరణ్ నాయుడు అతని అన్న నగేష్ వదిన ప్రియాంక మరియు అతని స్నేహితులు ఫారూఖ్ సులేమాన్ మరియు బాలు దౌర్జన్యంగా తేజశ్రీ ఇంటిలోనికి ప్రవేశించి కులం పేరుతో దూషించి భయపెట్టినారని అతని తల్లి మధుర కూడా కులం పేరుతో దూషించిందని పైగా రామ్ చరణ్ తన వద్ద నుంచి సుమారు పైగా రామ్ చరణ్ తన వద్ద నుంచి సుమారు 5,50,000 రూపాయలు నమ్మించి తీసుకున్నాడని.తేజశ్రీ ఫిర్యాదు మేరకు రామ్ చరణ్ నాయుడు అతని కుటుంబ సభ్యులు మరియు స్నేహితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలియజేశారు.

ఆంజనేయుని గెటప్‌లో కడప వాసి మహిత్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆది పురుష్ సినిమా విడుదలవుతున్న సందర్భంగా కడప నగరంలోని ఎస్సార్ థియేటర్ వద్ద సినిమాలోని ఆంజనేయుని పాత్ర గెటప్‌లో కడప నగరం మరియాపురానికి చెందిన పత్తూరు దేవదానం, శ్రీజయల కుమారుడు పి మహిత్ హీరో ప్రభాస్ అభిమానుల మధ్య ఆంజనేయుని వేషమును వేసి హీరో ప్రభాష్ అభిమనులను అలరిస్తూ అందరిని ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా మహిత్ మాట్లాడుతూ తాను సినిమా రంగంలో హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో శిక్షణ పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం యాడ్ ఫిలిమ్స్, షార్ట్ ఫిలిమ్స్, యూట్యూబ్ పాత్రలలో నటిస్తున్నట్లు తెలిపారు. సినిమా రంగంలోని నిర్మాతలు డైరెక్టర్లు అవకాశాలు కల్పించి ఆదుకోవాలని కోరారు.

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ ఆర్ రమేష్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర- రామాపురం : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తాము అండగా ఉంటామని రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ ఆర్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కసి రెడ్డి గారి పల్లె పంచాయతీ కొత్తపల్లి చెందిన టిడిపి కార్యకర్త మాదాసు బలరాం మృతికి నివాళులర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే గువ్వల చెరువుకు చెందిన టిడిపి కార్యకర్త షేక్ నాయబ్ రసూల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ని పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలి శెట్టి చంద్రమౌళి. నంద్యం రామ్మోహన్ రెడ్డి. కృష్ణయ్య. రమేష్ బాలకృష్ణ. సాయి నారాయణ. వెంకటరమణ. కొండయ్య అజామ్. షంషేర్ బాషా. హరిప్రసాద్ . ఉదయ్ కుమార్, ఖాదరవల్లి. సర్దార్. జాఫర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

బిసిల బలోపేతం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

విశాలాంధ్ర:-పీలేరు :- బిసిల పోరుబాట కార్యక్రమాన్ని విజయ వంతం చేయుటకు సిద్ధంగా ఉండాలని బిసి సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి బీసీలకు పిలుపునిచ్చారు. పీలేరు తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి,పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలమేరకు, తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో బిసిలతో సమావేశం జరిగింది బిసిల పోరుబాట కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తెలుగుదేశంపార్టీ అనుబంధ సంఘం బిసి సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఈకార్యక్రమం టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ గాండ్ల సాధికార కమిటి సభ్యులు విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పురం రామ్మూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సగ భాగం ఉన్న బిసిలపై వైకాపా ప్రభుత్వంలో దాడులు జరుగుతున్నాయని,ప్రశ్నించే వారిని అనగ తొక్కుతున్నారని,రాష్ట్రంలో బిసి కోటాలో అగ్రకులాలకు చోటు కల్పిస్తూ బిసిలకు తీవ్ర అన్యాయం చేస్తున్న వైకాపా ప్రభుత్వంపై టీడీపీ ఆధ్వర్యంలో బిసిల పోరుబాట తప్పదని అన్నారు. బిసిలకోసం తెలుగుదేశంపార్టీ ప్రత్యేక చట్టం తేనున్నారని యువనేత నారాలోకేష్ యువగళం పాదయాత్రలో స్పష్టంగా హామీ ఇచ్చారని, బిసిల బలోపేతం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని అన్నారు. బిసిల కులాల్లో యాదవ,పాలఏకిరి, వడ్డెర. ఈడగగౌడ. నాయి బ్రాహ్మణ, ఈడిగ, గౌడ, కృష్ణబలిజ,పూసల, సాగర, ఉప్పర,ముదలియర్, విశ్వబ్రాహ్మణ,గాండ్ల, తెలికుల, బోయ,వాల్మీకి, దూదేకుల,రజక, కురబ, కురమ,మేదరి, వీరశైవల్, లిగాయత్, లింగ బలిజ. శాలివాహన, విశ్వబ్రాహ్మణ, పద్మశాలి, తోగట,బెస్త మత్స్య కారులు, ముదిరాజ్, దాసరి, ఎంబిసి, జంగం,కొప్పుల వెలమ, భట్రాజులు, మేదరి,పెరిక, లాంటి కులాలు రాష్ట్రంలో సగభాగం ఉన్నారని రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వంలో బిసిలపై జరుగుతున్న దాడుల్ని, అన్యాయాన్ని నిలదీయాలని, బిసిల పోరుబాట కార్యక్రమాన్ని విజయ వంతంచేసి తెలుగుదేశంపార్టీకి అండగా నిలబడి పార్టీని బలోపేతంచేసి టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికారప్రతినిధి స్పోర్ట్స్ మల్లి,పీలేరు నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షులు వసంతల రాజా,మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర,పొలిశెట్టి సురేంద్ర,(సాపల సూరి)చెన్నారెడ్డి కాలనీ హరి,రెడ్డిముని, రమాదేవి,ముదుపుల వేముల మాజీ సర్పంచ్ చంద్రయ్య, అప్పస్వామి, భాస్కర, రెడ్డిముని, తదితరులు పాల్గొన్నారు.

అమీషాకు ఏం తెలుసు ఏపీ రాజకీయాలు : వీరబల్లి సునీల్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : అమిత్ షా మాటలు ఏపీ ప్రజలు మనోభావాలు దెబ్బతినెలా వున్నాయని వైసిపి జిల్లా యువ కన్వీనర్ వీరబల్లి సునీల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ప్రజల కోసం వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి జిల్లాలో ప్రజల కష్టాలు తీర్చేందుకు కడప ఎంపీ అవినాష్ రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, రాయచోటి శ్రీకాంత్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబులు ప్రజల కోసం ప్రజల సంక్షేమ కోసం నిత్యం పాటుపడుతున్న నాయకులు అన్నారు. రాష్ట్రంలో ఇంత గొప్ప పరిపాలన అందిస్తుంటే అమిత్ షాకు ఏమి తెలుసు అని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు అన్ని సంక్షేమాలు నేరుగా ఇంటి వద్దకే చేర్చేందుకు సచివాలయాలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. అలాంటి వైసిపి ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం అమిత్ షా చేయడం మంచి పద్ధతి కాదన్నారు.